VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A, New Zealand)
QEAC No. E334
www.victoriaoverseas.com

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక


Host On Your Domain
Hosting / Admin Panel
Page Builder / Social Links
Responsive Design
Advertisement Spaces
Search Engine Optimization
XML Sitemap
Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

సంపుటి: 5 సంచిక: 334, పేజీలు - 08
ఆదివారం, మే 24, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## హీట్ వేవ్‌పై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

- ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత
- వడగాల్పులతో 7జిల్లాల్లో 16 మంది మృత్యువాత
- మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం
- రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సమీక్ష

2లో..



# తెలంగాణ కేబినెట్ వరాల జల్లు



## రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం భేటీ

- 2027 గోదావరి పుష్కరాలకు రూ.1,000 కోట్లు కేటాయింపు
- తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు
- జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం
- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం కార్యక్రమాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2027లో జరగనున్న గోదావరి నది పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ గోదావరి పుష్కరాలకు సంబంధించిన పనులకు రూ.1000 కోట్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగానే మొదటి విడత కింద రూ.300 కోట్లను మంజూరు చేసేందుకు తెలంగాణ కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ క్రమంలోనే తాజాగా నిర్వహించిన ఈ కేబినెట్ భేటీలో సీఎం, మంత్రులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. త్వరలో ప్రారంభం కానున్న 2026-2027 విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం ప్రకటించింది. అదే సమయంలో స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, పాలు కూడా అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు మరింత పౌష్టికాహారాన్ని అందించడంలో భాగంగా ఈ బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను అమలు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇక కేంద్ర ప్రభుత్వ సంస్థలైన అస్సాం రైఫిల్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సెంటర్లను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు

2లో..

## మోదీతో మార్కో రూబియో కీలక చర్చలు

### - అమెరికా రావాలని ఆహ్వానం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరఫున మోదీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్-అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. మరోవైపు ఇరాన్ ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**- అమెరికా రాయబారి ట్వీట్**



ఈ చర్చల్లో పాల్గొన్న అమెరికా

2లో..

# ఆహారమే ఔషధం.. వంటగది ఒక ఔషధశాల

### - 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ఆరోగ్య పథకం ప్రారంభం
- రాష్ట్రంలో వైద్యరంగానికి రూ. 19,305 కోట్లు కేటాయించామని వెల్లడి
- నీటి సంరక్షణతో అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలాలు, పచ్చదనం పెరిగాయని వివరణ
- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి క్యాలెండర్ విడుదల చేశామని స్పష్టం



అమరావతి (ప్రశ్న న్యూస్) "ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కంద్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు.

2లో..

## రెండు నెలల్లోనే మార్పు తథ్యం

- తమిళనాడు ఎన్నికల్లో మార్పు కోరుకున్న ప్రజలు
- ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి గండికొట్టిన విజయ్
- అవినీతిపై పోరాటం ప్రకటించిన టీవీకే ప్రభుత్వం



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పును కోరుకున్నారు. దాదాపు 60 ఏళ్లుగా అధికారం పంచుకుంటోన్న ద్రావిడ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంలను తిరస్కరించారు.

2లో..

## నేషన్ ఫస్ట్...ఫ్యామిలీ నెక్స్ట్ అనే నినాదంతో పనిచేయాలి

### - తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న బండి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మోడీ 3.0 పాలనలో దక్షిణ భారత దేశంలో కేంద్రం నుండి అత్యధిక ప్రయోజనాలు పొందుతున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అందులో భాగంగా గత రెండేళ్లలో రూ.3 లక్షల కోట్లకుపైగా ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు చేసుకోగలిగామన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉండటంవల్లే ఇది సాధ్యమైందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం సైతం మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లలో 12 లక్షల కోట్లు ఖర్చు చేసింది. తెలంగాణ ప్రజలు సైతం డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలనే భావనలో ఉన్నారని తెలిపారు. అమెరికా ఇరాన్, రష్యా ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచమంతా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. భారత్ దేశం సుస్థిరంగా ఉండాలంటే ప్రధాని నరేంద్రమోడీ సూచించిన సప్తసూత్రాలను ఖచ్చితంగా పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సప్తసూత్రాలను పాటిస్తూ మీరే చేసే పొదుపు ఈ దేశ భవితకు మలుపు కానుందని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్ రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ఆడిటోరియంలో శనివారం ఉదయం నిర్వహించిన

2లో..

## తిరుమల తరహాలో యాదగిరిగుట్ట

- రూ.100 కోట్లతో సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి పనులు
- యాదాద్రిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల
- పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) తెలంగాణలో పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు తాజాగా శంకుస్థాపనలు చేశారు. యాదగిరిగుట్టలో సంప్రదాయ వేదపాఠశాల భవనానికి కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాదగిరిగుట్టను యాదాద్రిగా పేరు మార్చగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. తిరిగి యాదాద్రిని యాదగిరిగుట్టగా మార్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యాదగిరిగుట్టను అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా అక్కడ భారీగా నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. రూ.43.79 కోట్లతో యాదగిరిగుట్టలో పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న వేదపాఠశాల భవనానికి సీఎం రేవంత్ రెడ్డి అంకురార్పణ చేశారు. రానున్న 2 ఏళ్లలో ఈ వేద పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రూ.9.88 కోట్లతో యాదగిరిగుట్టపై నిత్య కల్యాణం రంగం మండపాల నిర్మాణం చేయనున్నారు. అదే సమయంలో రూ.1.41 కోట్లతో

2లో..

## కారుతో ఢీకొట్టి న్యాయవాది హత్య

### - వెలుగులోకి సీసీ పుటేజీ





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగరంలోని మాసబ్‌ట్యాంక్ పరిధిలో శనివారం ఉదయం ఒక దారుణం చోటుచేసుకుంది. ఒక సీనియర్ న్యాయవాదిని దుండగులు కారుతో ఢీకొట్టి హతమార్చడం తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అడ్వకేట్ కాజా మొయినుద్దీన్ శనివారం ఉదయం తన ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఆయన తన కారులో బయలుదేరడాని సిద్ధంగా ఉన్నారు. కారు డోర్ తీస్తున్న సమయంలో ఓ కారు ఆయనను వెనుక నుండి వచ్చి అత్యంత వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అడ్వకేట్ మొయినుద్దీన్‌కు తీవ్రమైన గాయాలయ్యాయి. ఆయనను గమనించిన స్థానికులు, వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతూ లాయర్ మొయినుద్దీన్ మృతి చెందినట్లు డాక్టర్లు, పోలీసులు తెలిపారు. లాయర్‌ను కారుతో ఢీకొట్టిన అనంతరం నిందితులు అక్కడి నుండి వేగంగా పరారయ్యారు. దుండగులు కారుతో ఢీకొట్టిన దృశ్యాలు ఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. పాత కక్షల కారణంగానే ఈ హత్య జరిగిందా అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలతో దర్యాప్తును వేగవంతం చేశారు. కబ్జాకు గురవుతున్న కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ బోర్డు భూములను కాపాడేందుకు ఆయన చట్టపరమైన పోరాటాలు చేస్తుండటమే ఈ హత్యకు ప్రధాన కారణమని వినిపిస్తోంది. లేక వ్యక్తిగత కక్షలతో హత్య చేశారా అనే కోణాల్లోనూ పోలీసులు విచారణ చేపట్టారు. నెంబర్ ప్లేట్ లేని కారుతో ఉద్దేశపూర్వకంగానే ఢీకొట్టి హత్య చేశారని సైతం వినిపిస్తోంది.

# జనసేన ఎమ్మెల్యేలపై పవన్ కల్యాణ్ ఫోకస్

### - పోలవరం ఎమ్మెల్యేకు క్లాస్

అమరావతి (ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై దృష్టి సారించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో వన్ టు వన్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు పార్టీ నుంచి పిలుపు వెళ్లింది. ఈ క్రమంలో శనివారం సచివాలయంలో తన ఛాంబర్‌లో ఉన్న డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో తూర్పుగోదావరి జిల్లా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై పవన్ కల్యాణ్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణలపై నిలదీశారు. ఈ సందర్భంగా క్లాస్ పీకినట్లు తెలుస్తోంది. పార్టీ దృష్టికి వచ్చిన కొన్ని స్థానిక అంశాలు, ఫిర్యాదులపై వివరణ కోరిన ఎమ్మెల్యే నాలుగు వారాల్లో అన్నింటిని సరిదిద్దుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు.



2లో..

## సీఎస్ఆర్ నిధులతో గవర్నమెంట్ స్కూల్స్ ఆధునీకరణ

### - రహేజా, రాంకీ, యశోద సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా రంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రహేజా గ్రూప్, రామ్ కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్‌లు భారీ నిధులు అందజేయనున్నాయి. సెక్రటేరియట్‌లో శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయా సంస్థల ప్రతినిధులు విద్యాశాఖతో అధికారికంగా ఒప్పందాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రహేజా గ్రూప్ అధ్యక్షుడు నీల్ సి. రహేజా, రామ్ కీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లా దాక్షాయణి, యశోదా గ్రూప్ డైరెక్టర్ గోరుకంటి దేవేందర్ రావు తమ ఒప్పంద పత్రాలను సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ప్రీ-ప్రైమరీ స్థాయి నుండి



2లో..

# హీట్ వేవ్‌పై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రోజురోజుకూ నిప్పుల కుంపటిగా మారుతోంది. రికార్డు స్థాయిలో 47 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా తీవ్ర భయాందోళనలు నెలకొంటున్నాయి. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సూచనలు చేసిన సంగతి తెలిసిందే. అత్యవసరం అయితే తప్ప ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇళ్ల నుంచి బయటికి రావద్దని సూచించింది. ఇక మధ్యాహ్నం పూట ప్రజల కోసం బయట ఏర్పాట్లు చేయాలని అధికారులకు సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్రంలో ఎండలు, వడగాలులు, వడదెబ్బ పరిస్థితులపై అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో రానున్న 3 రోజుల పాటు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్న నేపథ్యంలో ప్రజలంతా మరింత అలర్ట్‌గా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక సూచనలు చేశారు. పిల్లలు, వృద్ధులు అత్యవసరమైతేనే బయటికి రావాలని తేల్చి చెప్పారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద ప్రజలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక వడదెబ్బతో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. గతంలో వడదెబ్బ పరిహారం రూ.50 వేలు ఉండగా దాన్ని రూ.4 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ఇక తెలంగాణలో రోజురోజుకు ఎండల తీవ్రత పెరిగిపోతుండగా 18కి పైగా జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే 18 జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. మరోవైపు హైదరాబాద్ నగరంలోనూ 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా వడగాలులపై హై అలర్ట్ ప్రకటించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఎండల తీవ్రతకు సంబంధించి గంట గంటకు ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఎండదెబ్బకు గురైతే వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# తెలంగాణ కేబినెట్ వరాల జల్లు

కరీంనగర్ జిల్లాను ఎంపిక చేస్తూ తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయానికి ఆమోదం తెలిపింది. ఇక తాజాగా కేబినెట్ భేటీలో పలు ఉద్యోగుల భర్తీకి కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో కొత్త పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులతోపాటు మరో 6 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేకాకుండా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మరో 3 పోస్టులను భర్తీ చేసేందుకు క్లియరెన్స్ ఇచ్చింది. వీటితో పాటు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఫైర్‌స్టేషన్ కోసం ఇంకో 18 పోస్టులను మంజూరు చేస్తూ కేబినెట్ అంగీకారం తెలిపింది.

# మోదీతో మార్కో రూబియో కీలక చర్చలు

రాయబారి సెర్గియో గోర్ భేటీ అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రధాని మోదీతో సమావేశం అద్భుతంగా సాగింది. భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో అమెరికా-భారత్ సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. ఈ రంగాలు ఇరు దేశాలను పటిష్ఠం చేయడమే కాకుండా స్వేచ్ఛా, బహిరంగ ఇండో-పసిఫిక్ రీజియన్‌ను ముందుకు తీసుకెళతాయి. అమెరికాకు భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి" అని పోస్ట్ చేశారు.

### - ఇరాన్ వివాదంపై చర్చ?

ప్రపంచ శాంతి భద్రతలపై చర్చించినట్లు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన శాంతి చర్చలు విఫలం కావడంతో ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడానికి ట్రంప్ యోచిస్తున్నారనే వార్తల నడుమ ఈ భేటీ జరిగింది. చర్చల్లో భాగంగా ఇరాన్ సంక్షోభం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసి పనిచేస్తాయని మోదీ పేర్కొన్నారు.

# ఆహారమే ఔషధం.. వంటగది ఒక ఔషధశాల

తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సీఎం వివరించారు. "రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు.

ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా కూడా వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక ఏఐ డాక్టర్ ఉంటాడని స్పష్టం చేశారు.వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ.19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తుచేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు.ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీఎం అన్నారు.

సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రమంతా తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని, పిడుగురాళ్లలో 49 డిగ్రీలు నమోదైతే, అన్నమయ్యలో 40 డిగ్రీలే ఉందని నివేదికలను ఉటంకించారు.సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని చంద్రబాబు తెలిపారు. నీవా పనులు పూర్తిచేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు-నగరి, మల్లెమడుగు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులను ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు.

# తిరుమల తరహాలో యాదగిరిగుట్ట

గుట్ట కింది నుంచి కొండ పైకి ఉన్న మెట్ల మార్గానికి పైకప్పు నిర్మించనున్నారు. ఇక మాఢవీధులకు మెట్లు నిర్మించేందుకు రూ.1.44 కోట్లను కేటాయించారు. మరో రూ.43.5 కోట్లతో దీక్షాపరుల మండపం, డార్మిటరీ హాల్స్ పనులకు కూడా సీఎం రేవంత్ రెడ్డి తాజాగా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. యాదగిరిగుట్ట టెంపుల్ సిటీని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పంలో భాగంగా ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు అధికారులు తెలిపారు. ఇక వేద పాఠశాలలో సంప్రదాయ ఆశ్రమ గురుకుల పద్ధతిలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్యను అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సముదాయంలో హోమాలు, యాగాలు నిర్వహించడానికి ప్రత్యేక యాగశాలలతో పాటు ఒక గోశాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటితోపాటు రథశాల వైపు వాయవ్య దిశలో ఉన్న మాడవీధులకు అనుసంధానంగా రూ. 1.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు.

# రెండు నెలల్లోనే మార్పు తథ్యం

దళపతి విజయ్ నాయకత్వంలోని కొత్త పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే)ను ఆదరించారు. దీంతో ప్రజాభిష్టానికి అనుగుణంగా పాలనలో విజయ్ ఎటువంటి మార్పు తీసుకొస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో తమిళనాట వేళ్లూనుకుపోయిన అవినీతిపై యుద్ధం ప్రకటించడం దృష్టిని ఆకర్షిస్తోంది. లంచం అడిగే ఫిర్యాదులకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసిన విజయ్ ఈ ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేయడం వంటివి సాధారణ రాజకీయ ప్రకటనల్లా కనిపించడం లేదు. ఇవన్నీ వ్యవస్థ సమూలంగా మార్చాలనే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో టీవీకే ప్రధాన కార్యదర్శి, ప్రజా పనుల శాఖా మంత్రి అదవ అర్జున మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు నెలల్లో మార్పు చూపుతామని తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్ర గీతం తమిళ్‌తాయ్ వాళ్తు వివాదం గురించి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రోజునే గవర్నర్‌తో విజయ్ 5 నిమిషాలు మాట్లాడారని అన్నారు. అంతేకాదు, తమ పార్టీ పేరే తమిళగ వెట్రి కళగం (టీవీకే) అని, తమిళానికే తమ తొలి ప్రాధాన్యత అని అర్జున పునరుద్ఘాటించారు. మొదటి వందేమాతరం పాడాలని సర్క్యులర్ వచ్చిందని గవర్నర్ తెలిపారని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తమ క్యాబినెట్ కూర్పు ఉందని చెప్పారు. సామాజిక సమీకరణాలు, సమతూకం పాటించారని ప్రజలు కొనియాడుతున్నారని అన్నారు. అంతేకాదు, వివిధ విభాగాల్లో 35 శాతం వరకు వసూలు చేసిన పార్టీ నిధుల కమిషన్ వ్యవస్థను రద్దు చేశామని పేర్కొన్నారు. ఇకపై పనులు చేయకుండా చేసినట్టు పూడిక తీయకుండా తీసినట్లు బిల్లులు పెడతామంటే కుదరదని అర్జున తెలిపారు. బినామీ బిల్లుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తామని ఉద్ఘాటించారు. ఏడు రోజుల్లో రాష్ట్రంలోని అవినీతి నిర్మూలన అయిందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలోని చివరి నెలలో ఆమోదించిన అన్ని ప్రధాన ప్రజా పనులు, రహదారుల టెండర్లపై సమగ్ర సమీక్ష చేపట్టామని, ముఖ్యంగా కరూర్ వంటి ప్రాంతాలలో అక్రమ ఇసుక, ఖనిజ తవ్వకాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్లకు కఠిన ఆదేశాలు జారీ చేశామని కూడా అర్జున తెలిపారు. 100 ఏళ్ల నాటి పీడబ్ల్యూడీని రియల్-టైమ్ డాష్‌బోర్డ్‌లు, సాఫ్ట్‌వేర్‌ల ద్వారా ఆధునీకరించి, దానిని ప్రధాన ప్రైవేట్ మౌలిక సదుపాయాల దిగ్గజాలతో పోటీపడగల స్వయం సమృద్ధి, లాభదాయక సంస్థగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

# నేషన్ ఫస్ట్...ఫ్యామిలీ నెక్స్ అనే నినాదంతో పనిచేయాలి

'రోజ్ గార్' మేళా కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా 120 మంది అభ్యర్థులు ఉద్యోగ అపాయిట్ మెంట్ లెటర్లను అందుకున్నారు.

### - కర్మయోగి పోర్టల్ ద్వారా కొత్తగా ఉద్యోగాలు

'10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలనే లక్ష్యంతో 2022 అక్టోబర్ 22న రోజ్‌గార్ మేళాను ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించినప్పుడు ఇది జరిగే పనేనా? అని చాలా మంది హేళన చేశారు. వాటిని పట్టించుకోకుండా అవినీతి, పైరవీలు, దళారుల ప్రమేయం లేకుండా ఇప్పటి వరకు 11 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన మోదీ కమిట్ మెంట్ కు నిదర్శనం'అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. '19వ విడత ద్వారా 47 ప్రాంతాల్లో రోజ్ గార్ మేళా ద్వారా మరో 51 వేల ఉద్యోగాల భర్తీ చేసి నియామక పత్రాలు అందించాం. గతంలో లీకేజీలు, పైరవీలకు, దళారుల ప్రమేయంతో ఉద్యోగాలిచ్చేవారు. మోదీ పాలనలో అలాంటివి తావులేకుండా మెరిట్ ఆధారంగా అర్హులైన వారినే ఉద్యోగాలు వరిస్తున్నాయి. ఈ రోజ్ గార్ మేళాను నిరంతరం కొనసాగించాలని భావిస్తున్నాం. కర్మయోగి పోర్టల్ ద్వారా కొత్తగా ఉద్యోగాలు పొందిన వారంతా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరుతున్నా. భారత్ ను ప్రపంచంలోనే నెంబర్ వన్ గా చేయాలనే సంకల్పంతో మోదీ కష్టపడి పనిచేస్తున్నారు. ఈ కృషిలో మీరంతా భాగస్వాములు కావాలి. కుటుంబానికే పరిమితం కావొద్దని కోరుతున్నా. దేశం ఫస్ట్.. నెక్స్ ఫ్యామిలీ అనే నినాదంతో పనిచేయండి'అని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు.

### - నిరుద్యోగుల కష్టాలు చూశాను

'గతంలో నేను ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని పెద్ద ఎత్తున నిరుద్యోగులతో కలిసి "నిరుద్యోగ మార్చ్" నిర్వహించాను. హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీకి వెళ్లిన. అక్కడ నిరుద్యోగులు పడుతున్న కష్టాలను చూసిన. తిండికి పైసల్లేక అరటి పండ్లు తిని పొట్ట నింపుకున్న వాళ్లను చూశాను'అని కేంద్రమంత్రి బండి సంజయ్ గుర్తు చేసుకున్నారు. 'రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలిచ్చే పరిస్థితి లేదు. కేంద్రం మాత్రం క్రమం తప్పకుండా నిరంతరం ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. మీరంతా సగర్వంగా గల్లా ఎగరేసుకుని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలుగా బతకండి. పైరవీల్లేకుండా మీరు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కాబట్టి అవినీతికి తావులేకుండా నిజాయితీ, నిబద్ధతతో పనిచేయండి. క్రియేటివిటీతో ఆలోచించి మీరు చేస్తున్న ఉద్యోగం ద్వారా ప్రజలకు మరింత సేవలందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి'అని కేంద్రమంత్రి బండి సంజయ్ సూచించారు.

### - మోడీ సప్త సూత్రాలు పాటించండి

'అమెరికా ఇరాన్, రష్యా ఉక్రెయిన్ యుద్ధంవల్ల ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో ఉంది. భారత్ ఆ సంక్షోభంలోకి వెళ్లకూడదంటే మోడీ సప్త సూత్రాలను పాటించాలి'అని కేంద్రమంత్రి బండి సంజయ్ సూచించారు. 'అవేమిటంటే 1.పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించండి. 2.మెట్రో, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, కార్‌పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాలను వాడండి. 3.బంగారం కొనుగోళ్లు తగ్గించండి. 4.వంటనూనె పొదుపుగా వాడండి. 5.రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయంవైపు మళ్లండి. 6.'వోకల్ ఫర్ లోకల్' నినాదం స్ఫూర్తితో విదేశీ వస్తువుల కంటే భారతీయ ఉత్పత్తులను కొనుగోలు చేయండి. 7. వర్క్ ఫ్రం హోం కు ప్రాధాన్యతనివ్వండి'అని కేంద్రమంత్రి బండి సంజయ్ దిశానిర్దేశం చేశారు. 'దేశ సరిహద్దుల్లో ఎండ, వాన, మంచు తుఫాన్లను తట్టుకుని సేవ చేస్తున్న జవాన్లు ఎంత గొప్ప వారో... సప్త సూత్రాలను పాటించే వారు అంతే గొప్ప వారు. 1965లో 50 రోజులపాటు ఇండియా పాకిస్తాన్ యుద్ధం దేశంలో ఆర్థిక, ఆహార సంక్షోభం "ప్రతి రోజు ఒక పూట తిండి మానేయండి లేదా ఒక్క పూట ఉపవాసం ఉండండి'అని పిలుపుకు అద్భుత స్పందన వచ్చింది. జై జవాన్ జై కిసాన్ నినాదంతో సైన్యం పరంగా ధృఢంగా నిలిచింది. హరిత విప్లవం వైపు వేగంగా అడుగులు పడి ఆహార ధాన్యాల కొరత లేకుండా చేసుకోగలిగాం. దీనిని దృష్టిలో ఉంచుకుని మోదీగారి సప్త సూత్రాలను పాటించండి. విదేశీ వస్త్రాలను కొనకండి. స్వదేశీ వస్త్రాలకు ప్రాధాన్యత ఇవ్వండి. క్రియేటివిటీతో ఆలోచించి దేశాన్ని సుసంపన్నంగా మార్చండి. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలుగు ప్రజలంతా భాగస్వాములు కావాలి'అని కేంద్రమంత్రి బండి సంజయ్ కోరారు.

### - యూసీఎఫ్ కింద తెలుగు రాష్ట్రాలకు రూ.7వేల 766 కోట్లు మంజూరు

'దేశంలోని అన్ని రాష్ట్రాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలన్నదే మోడీ లక్ష్యం. అందుకోసం నిరంతరం కష్టపడుతున్నారు. అందులో భాగంగా మోడీకి తెలుగు రాష్ట్రాలంటే ప్రత్యేకమైన అభిమానం. యూసీఎఫ్ కింద ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు 7 వేల 766 కోట్లు మంజూరు చేసింది. తెలంగాణ అభివృద్ధి కోసం గత 12 ఏళ్లలో 12 లక్షల కోట్లు ఖర్చు చేసింది'అని కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పుకొచ్చారు. 'మోడీ 3.0 పాలనలో ఏపీకి అత్యధిక నిధులిస్తోంది. రెండేళ్లలోనే 3 లక్షల కోట్లకుపైగా ప్రాజెక్టుల ప్రారంభించారు.

కర్నూలు పర్యటనలో 13 వేల 430 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభించారు. అమరావతి రాజధాని అభివృద్ధి పనులకు 58 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటన. దక్షిణ భారత దేశంలో మోడీ 3.0 పాలనలో అత్యధిక ప్రయోజనాలు పొందుతున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారు'కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పుకొచ్చారు. దీనికి కారణం డబుల్ ఇంజిన్ సర్కార్ కొనసాగడమే. అందువల్లే కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయి. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ అధికారంలో ఉంటే రాష్ట్రానికి ఎన్ని లాభాలు ఉంటాయో ఏపీయే నిదర్శనం. అంత్యోదయ సిద్ధాంతాన్ని తూ.చ తప్పకుండా పాటిస్తూ అంబేద్కర్ స్ఫూర్తితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను దేశ ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వం మోడీదే'అని కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పుకొచ్చారు.దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, ఎడీఆర్ఎం శివప్రసాద్, డీపీఓ హెచ్.ఎల్.ఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఉపయోగిస్తాను : చదలవాడ శ్రీనివాసరావు

మానవతా వాది కళా పోషకులు చదలవాడ శ్రీనివాసరావు ని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర అభివృద్ధి సంస్థ బోర్డ్ ఆఫ్ డైరక్టర్ గా నియమించిన శుభ సందర్భంలో తెలుగు ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ పాలక మండలి శ్రీనివాసరావు గారిని కలిసి అభినందన శుభాకాంక్షలు తెలియచేయటం జరిగింది.

అధ్యక్షులు బత్తుల ప్రసాద్ రావు ప్రధాన కార్యదర్శి సురేష్ కొండేటి చదలవాడ శ్రీనివాస్ రావు గార్కి పుష్ప గుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియ చేసారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తనవంతు కృషి చేసెందుకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుస్తానని, పరిశ్రమలో చిన్నా పెద్ద భేదం లేకుండా అందరికి అందుబాటులో ఉంటానని చదలవాడ శ్రీనివాస్ రావు ఈ సందర్భంగా తెలియచేసారు ఈ కార్యక్రమంలోఫిల్మ్ క్రిటిక్స్ పాలక మండలి సభ్యులు బాల రెడ్డి, యం గిరిధర్, చదలవాడ భరద్వాజ, అప్పాజీ, పర్వీన్, బాబీ నవీన్ తదితరులు శ్రీనివాస్ రావు గార్కి అభినందనలు తెలియ చేసారు

# సీఎస్ఆర్ నిధులతో గవర్నమెంట్ స్కూల్స్ ఆధునీకరణ

ఇంటర్మీడియట్ వరకు కార్పొరేట్ స్థాయిలో అధునాతన హంగులతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ లో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు కొత్త ప్రాంగణ నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చులో 40 శాతం (రూ. 19.66 కోట్లు) భరించేందుకు రాంకీ సంస్థ అంగీకరించింది. అలాగే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ అభివృద్ధిలో భాగంగా ప్రీ-ప్రైమరీ నుంచి ఐదో తరగతి వరకు, ఇంటర్ తరగతుల నిర్మాణం కోసం 40 శాతం వాటా కింద రూ. 10.4 కోట్లను రాంకీ సంస్థే భరించనుంది. రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు అవసరమైన అత్యాధునిక వసతుల కోసం రహేజా గ్రూప్ ఏకంగా రూ. 50.50 కోట్ల నిధులను పూర్తిగా భరించడానికి ముందుకు వచ్చింది. దీనితో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ సుభాష్ నగర్ లోని ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ, 6వ, 7వ తరగతుల గదుల నిర్మాణం, వసతుల కోసం యశోదా హాస్పిటల్స్ రూ. 12.20 కోట్ల నిధులను కేటాయించింది. తెలంగాణ ప్రభుత్వ విద్యాసంస్థల రూపురేఖలు మార్చే ఈ అత్యున్నత కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సి. శేఖర్ రెడ్డి, తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గణపతి రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్పొరేట్ సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు మోడల్ స్కూల్స్‌గా మారనున్నాయి.

# జనసేన ఎమ్మెల్యేలపై పవన్ కల్యాణ్ ఫోకస్

### - నాలుగు వారాలు గడువు ఇచ్చిన పవన్ కల్యాణ్

జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సచివాలయంలో భేటీ అయ్యారు. ?పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై సమీక్ష చేపట్టారు. ?పోలవరం నియోజక వర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను వివరణ అడిగారు. ?తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలసి కూర్చొని చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ?నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోలవరం ఎమ్మెల్యేకి గడువు ఇచ్చారు. ?పోలవరం నియోజక వర్గంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ.147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపై పవన్ కళ్యాణ్ సమీక్షించారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై నిలదీశారు. ?అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని వ్యక్తిగత వ్యవహారాలు చక్కదిద్దుకొంటానని ఎమ్మెల్యే బాలరాజు చెప్పారు. వ్యక్తిగత వ్యవహారాలను చక్కదిద్దుకొనేందుకు నాలుగు వారాలు గడువు ఇచ్చినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ఎమ్మెల్యే బాలరాజు ధన్యవాదాలు తెలిపారు. ఈ భేటీలో పీఏసీ చైర్మన్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ఉన్నారు.

మరోవైపు మహిళపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు సైతం జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్లాస్ పీకినట్లు తెలుస్తోంది. లైంగిక వేధింపు ఆరోపణలపై తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. సచివాలయంలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చాంబర్‌లో జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తనపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు, ఆ తర్వాత జరిగిన పరిణామాల వరుస వివాదాలపై పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వివరణ ఇచ్చారు. అనంతరం శాసన సభ విప్ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్నిడిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందజేశారు. వ్యక్తిగత కారణాలతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు.

# వైఎస్ జగన్ బాధితుడు కాదు... నిందితుడు

### - మంత్రి పయ్యావుల

**అమరావతి** వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ ఫ్యామ్లీ అయితే... జగన్ దాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. జగన్ అరాచక రాజకీయాలపై యువత ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. జగన్ బాధితుడు కాదు... నిందితుడంటూ వ్యాఖ్యానించారు.జగన్ బెంగళూరు నుంచి వచ్చినప్పుడల్లా కొత్త వాదన తెస్తాడు. గతంలో నన్ను సన్మానించాలని అన్నాడు... నిన్నటికి నిన్న తనంత మంచోడు లేడని సెల్ఫ్ సర్టిఫికెట్ ఇచ్చుకున్నాడు. వివేకా హత్య కేసులో ఏం జరిగిందో నిక్కరు వేసుకున్న కుర్రాడు కూడా చెబుతాడు... అలాంటి వాటిల్లో కూడా జగన్ అసత్యాలు చెబుతున్నారు. వైఎస్ కుటుంబంతోనే రాజకీయాలు నేరమయ్యాయి... రాజకీయాల్లోకి ఫ్యాక్షన్ తెచ్చారు. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీమలో ఫ్యాక్షనిజానికి అండగా నిలిచింది. నాటి ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో పార్నపల్లి అనే గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చింది. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేతల ఇళ్లకు డ్రిల్ చేసి డైనమేట్లు పెట్టి పేల్చారు.. ఇదీ రాజారెడ్డి చరిత్ర. ఓ ఇంటిని డైనమేట్లు పెట్టి పేల్చేసిన ఘటనను ఇప్పటికీ ఎవ్వరూ మరిచిపోలేదు. తన ప్రత్యర్థుల మీద దాడి చేయించి... అదే సందర్భంలో వేరే చోట ఉన్నట్టు ఎలిబీ సృష్టించుకోవడం అనేది వైఎస్ ఫ్యామ్లీతోనే మొదలైందని అన్నారు.లింగాల మండలంలో ముగ్గురు టాప్ లీడర్లను భయానకం సృష్టించి లొంగదీసుకున్నారు. ఇలాంటివి పదుల సంఖ్యలో పులివెందులలో జరిగాయి. రాజారెడ్డి నుంచి మొదలుకుని పులివెందులలో జరిగిన ఘటనలపై పుస్తకం వేస్తాం. చంద్రబాబు సీఎం అయ్యాక సీమలో ఫ్యాక్షన్ను కంట్రోల్లోకి వచ్చింది. వైఎస్ ఫ్యామ్లీ మొదలు పెట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను కంట్రోల్ చేయడానికి 30 ఏళ్లు పట్టింది. జగన్ బాధితుడు కాదు.. నిందితుడు రప్పా రప్పా అంటే వారితో ఫొటోలు దిగుతారు. సొంత పార్టీ కార్యకర్త కారు కింద నలిగిపోయిన పట్టించుకోరు. ఇవాళ గొడ్డలి అంటే జగన్ మోహన్ రెడ్డికి ఉలికిపాటుకు గురవుతున్నారు. గొడ్డలిపోటును గుండెపోటుగా చూపించగలరు. నిజాలను ప్రజలకు చెప్పాలి... అవగాహన కల్పించాలి. అందుకే గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం... గొడ్డలి పార్టీ నెవ్వర్ ఎగైన్. ఓ తరానికి ఉపాధి కల్పించేలా చంద్రబాబు అవకాశాలు సృష్టించారు. జగన్ మోహన్ రెడ్డి ఉపాధి అవకాశాలను పోగొడుతున్నాడని అన్నారు.

## ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ను సిజ్ చేయాలి

### - ప్రభుత్వ అనుమతులు రాకముందే స్కూల్లు ఏర్పాటు చేసిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
### - ఆర్ పి ఎస్ ఎఫ్, పి ఆర్ ఎస్ వై ఎఫ్



**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు పట్టణం లో ప్రభుత్వం నిబంధనలు కు వ్యతిరేకంగా ముందస్తు అడ్మిషన్స్ నిర్వహిస్తున్న ప్రైవేట్ మరియు కార్పొరేట్ స్కూల్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలి అని ఆర్ పి ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిది, పి ఆర్ ఎస్ వై ఎఫ్ రాష్ట్ర నాయకులు రఘునాథ్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులలో ఎటువంటి అడ్మిషన్స్ చేసుకోకూడదు అని జీవో ఇచ్చిన కూడా ఎమ్మిగనూరు లో మాత్రం నిబంధనలు బేఖతార్ చేస్తూ ముందుస్తూ అడ్మిషన్స్ చేసుకోవడమే కాకుండా డొనేషన్స్ రూపంలో వేల రూపాయలు ను తల్లితండ్రులు నుంచి నిలువ దోపిడీ చేస్తున్నారు. అలాగే స్కూల్స్ లో పనిచేసే టీచర్స్ కి అడ్మిషన్స్ టార్గెట్ లు ఇచ్చి అవి పూర్తి చేయాలి అని లేనిపక్షం లో ఉద్యోగం నుంచి తొలగిస్తామని టీచర్లకు స్కూల్ యాజమాన్యలు వేధిస్తున్నారు. ఇంకా కొన్ని స్కూల్స్ కి ప్రభుత్వం నుంచి సరైన అనుమతులు రాకున్నా అప్పుడే స్కూల్స్ ని ఏర్పాటు చేసి రంగు రంగుల కరపత్రలు పంచుతు విద్యార్థులును మరియు తల్లితండ్రులు ను మోసం చేస్తున్నారు అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికి అయినా విద్య శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వం నిబంధనలు ను పాటించని స్కూల్స్ పై కఠిన చర్యలు తీసుకోని సిజ్ చేయాలని వారి డిమాండ్ చేశారు లేని పక్షంలో ప్రత్యక్షంగా స్కూళ్ల ముందు ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం నాయకులు నర్సింహా నాయుడు, బాబా,మహబూబ్, లక్ష్మన్న, షైక్ష తదితరులు పాల్గొన్నారు

# టాస్కా శ్రీరంగవరం శాఖ అధ్యక్షులు గా లక్ష్మణ్ గౌడ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) టాస్కా మేడ్చల్ జిల్లా శ్రీరంగవరం శాఖ అధ్యక్షులుగా వి లక్ష్మణ్ గౌడ్ నియమకమయ్యారు. మేడ్చల్ జిల్లా ఎల్లంపేటలో మున్సిపల్ పరిధిలోని శ్రీరంగ వరంలోని జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ లో శ్రీరంగవరం శాఖ టాస్కా ఎన్నికల ను నిర్వహించారు.జిల్లా టాస్కా అధ్యక్షుడు ఎం.వి రామచంద్ర మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులు పీ. నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిఎస్ఎన్ చౌదరి, రాష్ట్ర కార్యదర్శి ఎన్ వెంకటయ్య గౌడ్ రాష్ట్ర సహాయ కోశాధికారి ఎం.వి ప్రేమ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ రంగవరం శాఖకు నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా వి లక్ష్మణ్ గౌడ్ ఉపాధ్యక్షులుగా కె శివయ్య, ఎండి సులేమాన్, కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా బి యాదయ్య, ఆర్గనైజేషన్ సెక్రటరీగా చాకలి అంజయ్య, ట్రెజరర్ గా వై మల్లారెడ్డి ఎన్నికయ్యారు. ఈసీ మెంబర్స్ గా పి జనార్దన్ గౌడ్, ఎం నరసింహ రెడ్డి, ఏం బాలకృష్ణ, వి ప్రభాకర్, రక్మారెడ్డి, అడ్వైజర్ గా ఎస్ కృష్ణారెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా టాస్కా రాష్ట్ర అధ్యక్షులు పి నరసింహారావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ హక్కుల పరిరక్షణ మరియు సంక్షేమమే టాస్కా ధ్యేయం అని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వయావృద్ధులకు 50 శాతం రాయితీ కల్పించాలని, ఆస్పత్రులలో వయోవృద్ధులకు ఒకరోజు సమయం కేటాయించాలని, రైళ్లలో ఇంతకుముందు ఉన్న మాదిరిగా రాయితీని పునరుద్ధరించాలని కోరారు ఈ కార్యక్రమంలో శ్రీరంగ వరంలోని వయోవృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తాళం వేసి ఉన్న ఇల్లులే లక్ష్యం

**రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్**

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డిఎస్పీ నాగేంద్రచారి**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) బి. వై నగర్ కి చెందిన అడెపు రవి అనే వ్యక్తి జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకుని పగలు సమయాల్లో పట్టణంలో రెక్కీ చేసి తన స్నేహితులు సామల్ల బాలకిషన్, బోదాసు గోపి, వేముల సాయి చరణ్ రెడ్డి, గాజులవేణి అరుణ్ కుమార్, మూల అభిలాష్ లతో ఒక ముఠాగా ఏర్పడి రాత్రి సమయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు.అడెపు రవి గతంలో 18 దొంగతనం కేసులలో జైలుకు వెళ్లి వచ్చినప్పటికీ వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాక మళ్లీ నేరాలకు పాల్పడలని నిర్ణయించుకుని, దొంగతనాలు చేస్తు బంగారు,వెండి ఆభరణాలను అమ్మితే వచ్చిన డబ్బులతో జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా తేది 26-04-2026 నుండి 21-05-2026 వరకు సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 ఇండ్లలో రాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారని, ఇంటి యజమానుల ఫిర్యాదు మేరకు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా,. తేది 23-05-2026 రోజున ఉదయం నిందుతులు ఏదైనా పెద్ద దొంగతనం చేద్దామని అనుకోని ఆటోలో సిరిసిల్ల కు వస్తుండగా నమ్మదగిన సమాచారంతో సిరిసిల్లలోని ఎల్లమ్మ సర్కిల్ వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు.అదుపులోకి తీసుకున్న నిందుతులను విచారించగా 17.5 గ్రాముల బంగారు ఆభరణాలు,14.5 తులాల వెండి ఆభరణాలు,మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, రెండు సెల్ ఫోన్స్ స్వాధీనం. దొంగతనం చేసిన బంగారు ఆభరణాలు ముస్తాబాద్ లోని కస్తూరి సాయితేజ కి, కొన్ని బంగారు, వెండి ఆభరణాలు వేములవాడలోని శీలం సంతోష్ రెడ్డి కి అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసినామని చెప్పగా వారి వద్ద నుండి బంగారు వెండి ఆభరణాలు, నగదు 1500/- రూ, మోటార్ సైకిళ్ళు, ఆటో స్వాదిన పరుచుకొని రిమాండ్ కి తరలించడం జరిగిందని డిఎస్పీ నాగేంద్ర చారి తెలిపారు. నిందుతులను పట్టుకోవడంలో కృషి చేసిన పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్.ఐ శ్రీకాంత్, సిబ్బంది పుల్కమ్ శ్రీనివాస్, శ్రీకాంత్, మారుతి, రవి, నాంపెల్లి శ్రీనివాస్, నాగరాజులను డిఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలి

**ముఖ్యమంత్రి ప్రకటించిన వేతనాలను సవరించాలి**

**సిఐటియు జిల్లాఉపాధ్యక్షులు బండ్ల స్వామి డిమాండ్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కార్మిక శాఖ పరిధిలోని షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల సవరణను సుమారు 14 సంవత్సరాల తర్వాత ప్రకటించడం హర్షణీయమని, ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు.అయితే ప్రకటించిన వేతనాలు పెరిగిన ధరలకు అనుగుణంగా లేవని, కార్మికులు మరియు కార్మిక సంఘాలు చేసిన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోందని పేర్కొన్నారు. పెరిగిన వేతనాలు కార్మికుల అవసరాలకు ఏమాత్రం సరిపోవని విమర్శించారు.కనీస వేతనాల పెంపుదల కోసం క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి, దేశానికి ఆదర్శంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో వేతనాల సవరణ చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆచరణలో చూస్తే వేతనాల పెంపులో శాస్త్రీయత లోపించిందని అన్నారు. 1948 కనీస వేతనాల చట్టం, డాక్టర్ అక్రాయిడ్ ఫార్ములా, సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా వేతనాలు నిర్ణయించలేదని ఆరోపించారు. 2020-21 సంవత్సరంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కనీస వేతనాల సలహా మండలి ఒక అన్‌స్కిల్డ్ కార్మికుడికి నెలకు రూ. 18,019 కనీస వేతనం ఇవ్వాలని సిఫార్సు చేసిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 16,000 మాత్రమే ప్రకటించడం అన్యాయమన్నారు.ప్రభుత్వం తక్షణమే కార్మికులు, కార్మిక సంఘాల డిమాండ్లు మరియు సలహా మండలి సిఫార్సులను పరిగణలోకి తీసుకొని కనీస వేతనాన్ని నెలకు రూ. 26 వేలుగా సవరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వం కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

# రామాయంపేటలో యువత బిఆర్ఎస్ చేరికలు.

**అక్కన్నపేట యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పద్మాదేవేందర్ రెడ్డి**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా రాజకీయాల్లో బిఆర్ఎస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రామాయంపేట మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామానికి చెందిన పలువురు యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి గులాబీ కండువా కప్పి యువకులను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో వగ్గు వంశీ (రఘుపతి), వెల్మల రేవంత్, ముత్యం రంజిత్, ముత్యం సందీప్, వగ్గు బన్ని, ముత్యం విష్ణు తదితరులు ఉన్నారు. అనంతరం పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల పట్ల ఆకర్షితులై యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బిఆర్ఎస్ పార్టీపై విశ్వాసం మరింత పెరుగుతోందన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చాయని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చగలిగేది బిఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. రాబోయే రోజుల్లో యువత పార్టీకి బలంగా నిలవాలని, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలపై పోరాడాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పాక్స్ చైర్మన్ బాధే చంద్రం, అక్కన్నపేట గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, టౌన్ యూత్ అధ్యక్షుడు రొయ్యల నవీన్, మండల నాయకులు ఉమామహేశ్వర్, శ్రీకాంత్ సాగర్, మద్దూరి శ్రీనివాస్, తాటిపల్లి రాంకీ, దొమ్మట్ట శ్రవణ్ గౌడ్, వెల్మల మహేశ్, బోడ శ్రీకాంత్ (బబ్లూ), పప్పయ్యగారి నర్సింలు, ఎల్లగారి రాజు, నాగరాజు, వంశీ సాగర్, పవన్ సాగర్, రాఘవేంద్ర, ప్రశాంత్ సాగర్, స్వామి, సిద్ధారములు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల గ్రీన్ సిగ్నల్

- **మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ విజ్ఞప్తికి స్పందించిన కమిషనర్ డా. జి.శ్రీజన**
- **అభివృద్ధి పనుల వేగవంతానికి కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌కు ఆదేశాలు**
- **వీధి దీపాల ఏర్పాటు కోసం రూ. 79 లక్షల భారీ నిధులు మంజూరు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని దశాబ్దాల కాలనీల సమస్యలకు, ప్రధాన రహదారుల దుస్థితికి త్వరలోనే మోక్షం లభించనుంది. స్థానిక ప్రజల ఇబ్బందులను తొలగించి, సర్కిల్ కార్యాలయం పరిధిలో ఉన్న సమస్యలను తొలగించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు నడుం బిగించారు. మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో పురపాలక మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ మేరకు సానుకూల కదలిక వచ్చింది.

### కమిషనర్ డా. జి. శ్రీజన తక్షణ ఆదేశాలు :

మేడ్చల్ సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను వివరిస్తూ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ సైబరాబాద్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. శ్రీజనకు సమగ్ర నివేదికను సమర్పించి విజ్ఞప్తి చేయగా దీనిపై సానుకూలంగా తక్షణమే స్పందించిన కమిషనర్ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. వెంటనే రంగంలోకి దిగి పనులను పర్యవేక్షించాలని, త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్‌ను ఆమె ఆదేశించారు.

### యుద్ధప్రాతిపదికన చేపట్టనున్న కీలక అభివృద్ధి పనులు :

కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో మేడ్చల్ పరిధిలో హౌసింగ్ బోర్డ్ కాలనీ నుండి లైబ్రరీ రోడ్ వరకు దెబ్బతిన్న రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడంతో మాజీ సర్పంచ్ దేవేందర్ రెడ్డి గారి ఇంటి నుండి ముదిరాజ్ సంగం (ఫిష్ మార్కెట్) వరకు రోడ్డు అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, సర్కిల్ కార్యాలయంలో అన్ని కాలనీల సీసీ రోడ్లలో ఏర్పడిన గుంతలను గుర్తించి, తక్షణమే సీసీ ప్యాచ్ వర్క్ పనులను పూర్తి చేయడంతో పాటు చారిత్రాత్మక తుమ్మ చెరువు, పెద్ద చెరువులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక అభివృద్ధితో పాటు సుందరీకరణ పనులు చేపట్టడంతో పాటు చెరువుల ఉనికిని కాపాడేందుకు, వాటిలోకి డ్రైనేజ్ నీరు కలవకుండా శాశ్వత డైవర్షన్ చర్యలు చేపట్టనున్నారు. చెరువుల చుట్టుపక్కల పరిరక్షణ చర్యలతో పాటు నిరంతరం పరిశుభ్రతను పర్యవేక్షించనున్నారు.

### చీకట్లను తరిమికొట్టేందుకు రూ. 79 లక్షల నిధులు :

సర్కిల్ కార్యాలయం పరిధిలోని అన్ని కాలనీలలో రాత్రి వేళల్లో ప్రజల భద్రతను మెరుగుపరిచేందుకు వీధి దీపాల ఏర్పాటు అత్యవసరమని అధికారులు గుర్తించారు. దీని కోసం కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ ప్రత్యేకంగా రూ. 79 లక్షల భారీ నిధులను మంజూరు చేశారు. కాలనీల అంతటా ఆధునిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన జోనల్ కమిషనర్ కు ప్రత్యేక చొరవ చూపిన కార్పొరేషన్ కమిషనర్ డా. జి. శ్రీజనకు చీర్ల రమేష్ మేడ్చల్ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బండ మాదారంలో వైభవంగా పెద్దమ్మ తల్లి, బొడ్రాయి పండుగ

- **హాజరైన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి**
- **గ్రామంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ**
- **ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి : ఎంపీ ఈటల రాజేందర్**
- **సాంప్రదాయ పండుగలు ఐక్యతకు ప్రతీకలు : ఎమ్మెల్యే మల్లారెడ్డి**





మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని బండమాదారం గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి బొడ్రాయి పండుగ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా గ్రామస్తులంతా ఏకమై ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం, ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ముఖ్య అతిథులు

ఈ ఆధ్యాత్మిక మహోత్సవ కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పెద్దమ్మ తల్లి, బొడ్రాయి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ప్రజాప్రతినిధులకు అర్చకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఘన స్వాగతం పలికి, వేద ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు.

### ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి : ఎంపీ ఈటల రాజేందర్

పూజా కార్యక్రమాల అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, వరుణ దేవుని కరుణతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామీణ పండుగలు సంస్కృతికి అద్దం పడతాయని పేర్కొన్నారు.

### సాంప్రదాయ పండుగలు ఐక్యతకు ప్రతీకలు : ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందేలా, ప్రజలందరినీ ఏకం చేసేలా ఇలాంటి సాంప్రదాయ పండుగలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. సాంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ ఉత్సవాల్లో పురపాలక సంఘం పరిధిలోని ప్రజాప్రతినిధులు, స్థానిక రాజకీయ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, బండ మాదారం గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. భక్తుల కోలాహలంతో బండ మాదారం గ్రామం అంతా పండుగ కాంతులతో కళకళలాడింది.

# గజ్వేల్‌లో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**-19 మందికి జరిమానాలు, జైలు శిక్షలు విధించిన కోర్టు -డి. సత్యనారాయణ ఇన్స్పెక్టర్, గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ లో గత వారం రోజులుగా గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 19 మందిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతి గౌడ్ ముందు కోర్టులో హాజరుపరచగా, విచారణ అనంతరం మొత్తం రూ. 1,13,000 జరిమానా విధించారు.అదేవిధంగా ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష, మరొకరికి మూడు రోజుల జైలు శిక్ష, ముగ్గురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు అధికారులు తెలిపారు.అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 09 మందికి ఒక్కొక్కరికి రూ. 5,000 చొప్పున మొత్తం రూ. 45,000 జరిమానా విధించబడింది.మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమైన నేరమని, దీనివల్ల అమాయక ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ డి. సత్యనారాయణ హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## వేములవాడ బైపాస్ రోడ్ల డివైడర్ల ఎత్తు పెంచాలి

**– సిపిఐ నేత : కడారి రాములు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో ఫస్ట్, సెకండ్ బైపాస్ రోడ్లలో నిర్మించిన డివైడర్లు ఎత్తుగా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సిపిఐ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి కడారి రాములు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలోనే అనేకసార్లు ఆర్ అండ్ బీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోయిందని విమర్శించారు. వెంటనే డివైడర్ల ఎత్తు పెంచడంతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు ప్రతి ఏడాది కోట్లాది మంది భక్తులు వస్తున్నప్పటికీ, ఆ స్థాయిలో మౌళిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. అలాగే రోడ్ల పక్కన ఉన్న డ్రైనేజీలపై బిళ్ళలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వేములవాడ రూరల్ మండల కార్యదర్శి శ్రీరాములు, పెంట మల్లేశం, నరేష్,గాజుల రమేష్, శేఖర్, నర్సయ్య, సామల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు ఆపాలి

**– సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను మానుకోవాలి**

**– ఎస్సీ,ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్రాధ్యక్షులు : కొంకటి శేఖర్**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో శనివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంకటి శేఖర్ మాట్లాడారు. ఈ సందర్భంగా బీసీ నాయకుడు ఉరుమళ్ల విశ్వం కూడా పాల్గొన్నారు.కొంకటి శేఖర్ మాట్లాడుతూ, మైనర్ బాలికకు న్యాయం జరగాలని కోరుతూ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేస్తున్న పోరాటాన్ని కొందరు సోషల్ మీడియాలో తప్పుదోవ పట్టించేలా విమర్శించడం దురదృష్టకరమన్నారు. బాధితురాలి తరపున నిలబడి న్యాయం కోసం ప్రశ్నిస్తున్న నాయకుడిపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు.బండి భగీరథ్ ఘటనలో అనేక అనుమానాలు ఉన్నాయని, అతను కొన్ని రోజుల పాటు ఎక్కడ ఉన్నాడు, అతనికి సహకరించిన వారు ఎవరు వంటి అంశాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగిందనే అంశంపై స్పందించకుండా, న్యాయం కోసం మాట్లాడుతున్న వారినే లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇప్పటివరకు తాము చట్టపరంగానే స్పందిస్తున్నామని, అయినప్పటికీ ఆర్ఎస్పీపై అసత్య ప్రచారాలు, ట్రోల్స్ కొనసాగితే సహించబోమని హెచ్చరించారు. సమాజంలో నిజం కోసం మాట్లాడే నాయకుల గౌరవాన్ని కించపరిచే ప్రయత్నాలు ఆపాలని కోరారు.ఈ సమావేశంలో బీసీ నాయకులు రమేష్ రెడ్డి, అబ్దుల్ ఖాదిర్, బడుగు నవీన్, ముడుపు కృష్ణమాచారి, నరేందర్, వెంకటస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతపల్లి బస్టాండ్ వద్ద ప్రమాదకర మలుపు

**– రోడ్డు విస్తరణకు గ్రామస్తుల విజ్ఞప్తి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని అనంతపల్లి గ్రామ బస్టాండ్ ఆవరణలో ఉన్న ప్రమాదకర మూలమలుపు స్థానికులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మలుపు వద్ద రహదారి ఇరుకుగా ఉండటంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో తరచూ ప్రమాద భయం నెలకొంటోందని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఒకేసారి రాకపోకలు సాగించే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. బస్టాండ్ పరిసర ప్రాంతం కావడంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణీకులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్నారని, రోడ్డు దాటే సమయంలో భయాందోళనలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు స్వల్ప ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, పెద్ద ప్రమాదం జరిగే ముందు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.మలుపు వద్ద రోడ్డు విస్తరణ చేపట్టడంతో పాటు హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేదంటే భవిష్యత్తులో తీవ్ర ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

## సేవ చేయాలంటే పదవులు, అధికారం అవసరం లేదు

**– ఎడపల్లి బాబు – వడదెబ్బతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థికసాయం – పరామర్శ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)చేసిన ఎడపల్లి బాబురాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన ఊరగొండ లక్ష్మీ నారాయణ శుక్రవారం వడదెబ్బతో మృతి చెందిన నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన ఎడపల్లి బాబు మానవతా దృక్పథంతో శనివారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థికసాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎడపల్లి బాబు మాట్లాడుతూ సేవ చేయాలంటే పదవులు, అధికారాలు అవసరం లేదని, మనసుంటే చాలని అన్నారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరికైనా ఇలాంటి ఇబ్బందులు వచ్చినప్పుడు తాను ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. మృతుడు లక్ష్మీ నారాయణ కుటుంబానికి ఆయన ధైర్యం చెప్పి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## ఉన్నత విద్యావేత్త సువీన్ యాదవ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం

**- యువతలో మంచి గుర్తింపు కలిగిన నాయకుడు సువీన్ యాదవ్**

**- కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**- సువీన్ యాదవ్‌కు కాంగ్రెస్ శ్రేణుల ఘన సత్కారం**

**- సమన్వయంతో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తా**

**- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు : కొమ్మనబోయిన సువీన్ యాదవ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, కొదురుపాక గ్రామంలో ఇటీవల నూతనంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కొమ్మనబోయిన సువీన్ యాదవ్‌కు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బోయినిపల్లి ప్యాక్స్ చైర్మన్ జోగినపల్లి వెంకటరామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో గ్రామ ప్రజాప్రతినిధులు,పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,రజక సంఘం ప్రతినిధులు,స్థానిక కాంగ్రెస్ నాయకులు కలిసి సువీన్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకత్వ బాధ్యతలు చేపట్టిన ఆయనకు మద్దతుగా నిలుస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. యువతలో మంచి గుర్తింపు కలిగిన ఉన్నత విద్యావేత్త సువీన్ యాదవ్ నాయకత్వంలో బోయినిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు చేరువగా ఉండే నాయకత్వంతో పార్టీ కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయని తెలిపారు.అనంతరం సువీన్ యాదవ్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు,తనకు అండగా నిలిచిన గ్రామ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.

## “గౌరవ వేతనం వద్దు - కనీస వేతనం కావాలి”

**- “ఉద్యోగ భద్రత మా హక్కు” బోయినిపల్లిలో సమ్మె**

**- న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి**

**- రూ. 20,000 కనీస వేతనం ఇవ్వాల్సిందే**

**- మండల వీఓఏ యూనియన్ సభ్యులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఐకేపీ,వీఓఏల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సెర్ప్ ఆధ్వర్యంలో బోయినిపల్లి మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి ఐదు రోజులకు చేరింది.ఈ సందర్భంగా వీఓఏ యూనియన్ జిల్లాధ్యక్షురాలు మంత్రి మణెమ్మ, మండలాధ్యక్షురాలు గుండేటి వరలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో మహిళా సంఘాల బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 20,000 ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలనే వారి డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని పేర్కొన్నారు. అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, సాధారణ,ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించడంతో పాటు 58 జీఓను సవరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించేంత వరకు, వారి సమస్యలు తీరేంత వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు,యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో వీఓఏలు పాల్గొని “గౌరవ వేతనం వద్దు – కనీస వేతనం కావాలి”, “ఉద్యోగ భద్రత మా హక్కు” అంటూ నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఈ నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని జేఏసీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

## బోయినిపల్లి లో వడదెబ్బతో వృద్ధుడు మృతి



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన ఊరగొండ లక్ష్మీ నారాయణ (75) వృద్ధుడు శుక్రవారం సాయంత్రం తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొద్ది రోజులుగా మండలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఆయన అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రయత్నించినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఆయన కన్నుమూశారని తెలిపారు. శనివారం గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## రైతు అకాల మరణం వార్త లో నిజం లేదు

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న గణపూరు గ్రామంలో వెంకటాపురం శంకరయ్య అనే రైతు అకాల మరణం అనే వార్తను పలు పత్రికలు ప్రచురించిన దృశ్య ఆ వార్తలో కొన్ని పత్రికలు నిజాన్ని వక్రీకరించి రాసినట్లు జిల్లా కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతు అకాల మరణం పట్ల కుల్చారం మండల తహసీల్దార్ (వీ=రా) నివేదిక ప్రకారం, సంబంధిత రైతు గుండెపోటుతోనే మరణించినట్లు వారి కుటుంబ సభ్యులు కూడా ఇదే విషయాన్ని తెలియజేసిన ట్లు నివేదికలో పేర్కొనబడినది. సంబంధిత రైతు ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం నిర్ణయించిన సీరియల్ విధానం ప్రకారమే కొనసాగుతున్నది.

అయితే కొన్ని దినపత్రికలలో ధాన్యం కొనుగోలు సమస్యల కారణంగానే రైతు మృతి చెందినట్లు ప్రచురించబడిన వార్త అవాస్తవమని తెలియజేయడమైనది. దీనిని ధాన్యం కొనుగోళ్ల సమస్యలతో ముడిపెట్టి ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని స్పష్టం చేయడమైనది.మెదక్ జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 2 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడగా, 30,210 మంది రైతుల ఖాతాల్లో రూ.336.65 కోట్లను నేరుగా జమ చేయడం పూర్తయింది.నిరంతరం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షలు నిర్వహిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ కొనుగోలు కేంద్రాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నరు .రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.కావున రైతులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేయడమైనది.

## ఓయూ లో అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



ఓయూ(ప్రశ్న న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీలో అధ్యాపకుల నియామకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఓయూ ఏబీవీపీ అధ్యక్షుడు గెల్లు శేఖర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పరిస్థితిలో పెద్దగా మార్పులు చోటుచేసుకోలేదన్నారు. రెండు ప్రభుత్వాలు మారినా యూనివర్సిటీల అభివృద్ధి, అధ్యాపక నియామకాల విషయంలో స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు.ఇటీవల రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చి యూనివర్సిటీలో రిక్రూట్మెంట్ చేపడతామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి నోటిఫికేషన్ విడుదల కాకపోవడం విద్యార్థులను నిరాశకు గురిచేస్తోందన్నారు.ఉస్మానియా యూనివర్సిటీలో మొత్తం సుమారు 1268 ప్రొఫెసర్ పోస్టులు ఉండగా ప్రస్తుతం కేవలం 312 మంది రెగ్యులర్ ప్రొఫెసర్లతోనే యూనివర్సిటీ నడుస్తోందని పేర్కొన్నారు.అధ్యాపకుల కొరత కారణంగా పరిశోధన రంగం తీవ్రంగా దెబ్బతింటోందని, విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. అనేక విభాగాలు గెస్ట్ ఫ్యాకల్టీ ఆధారంగా నడుస్తుండటం వల్ల విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యంగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు సరైన గైడెన్స్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఉస్మానియా యూనివర్సిటీతో పాటు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని గెల్లు శేఖర్ డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆలస్యం చేయకుండా రిక్రూట్మెంట్ ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఇటుక బట్టీలలో బాల కార్మికులతో పని చేయిస్తే కఠిన చర్యలు

**తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల హెచ్చరిక**




మేడ్చల్( ప్రశ్న న్యూస్) బాల కార్మికుల చే ఇటుక బట్టీలలో పనిచేస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గోగుల సరిత, చందన హెచ్చరించారు. మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని రావల్ కోల్ లో ఇటుక బట్టీల దగ్గర చిన్న పిల్లలతో పని చేయిస్తున్నారు అన్న సమాచారంతో తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గోగుల సరిత, చందన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కడ ఉన్న పిల్లలకు చదువు అందించాలని, పిల్లలకు హెల్త్ చెకప్ చేయించాలని సూచించారు. ఇటుక బట్టీల వద్ద వర్క్ సైట్ స్కూల్స్ ఏర్పాటు చేసి చిన్నపిల్లలను అందులో చేర్పించి విద్యను అందించాలని ఆదేశించారు. బాల కార్మికులను ఇటుక బట్టీలో పని చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చదువుకునే వయసులో పిల్లలు పాఠశాలలకు వెళ్లాలే తప్ప పనుల్లోకి కాదని సూచించారు. చిన్నారులను దగ్గరకు తీసుకొని వారితో ముచ్చటించారు. వీరిని వెంటనే పాఠశాలలో చేర్పించి విద్యను అందించాలని సూచించారు.

# మానవత్వం చాటుకున్న జర్నలిస్ట్ శిరీష

**- తల్లి--బిడ్డ ప్రాణాలను కాపాడిన ధైర్యవంతురాలు - సమాజం కోసం ఇలాంటి మానవత జర్నలిస్టులు కావాలి**

**- జనం కోసం జర్నలిస్టులు ప్రాణం కోసం వైద్యుల సేవలు**



**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్ట్ ఇప్పుడు ప్రాణాలను కాపాడిన మానవతావాది ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల ప్రధాన బాధ్యత. కానీ కొన్ని సందర్భాల్లో జర్నలిస్టులు వార్తలు రాయడమే కాదు, మానవత్వంతో ముందుకొచ్చి ప్రాణాలను కాపాడే పాత్రను కూడా పోషిస్తారు. అలాంటి అరుదైన సంఘటనలో ఒక జర్నలిస్టు తన తెలివితేటలు, చాకచక్యం, మానవత్వంతో ఒక గర్భిణీని, ఆమె బిడ్డ ప్రాణాలను కాపాడి నిజమైన సేవాభావానికి ప్రతీకగా నిలిచింది. ఆ జర్నలిస్టు పేరు శిరీష.ఒక మహిళ గర్భధారణ చివరి దశలో ఉండగా ప్రసవ సమయంలో ఊహించని ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. వైద్యుల సమాచారం ప్రకారం, గర్భంలోని శిశువు మెడ చుట్టూ పేగు (నాభి తాడు) చుట్టుకోవడం, అదేవిధంగా బిడ్డ అడ్డంగా తిరగడం వల్ల ప్రసవం అత్యంత క్లిష్టంగా మారింది. సాధారణ ప్రసవం ద్వారా శిశువును బయటకు తీసే పరిస్థితి లేకపోవడంతో తల్లి,బిడ్డ ఇద్దరి ప్రాణాలకు ముప్పు ఏర్పడింది. కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురై ఏం చేయాలో తెలియక కంగారు పడుతున్న సమయంలో జర్నలిస్టు శిరీష ముందుకొచ్చింది. శిరీషకు ఈ విషయం తెలిసిన వెంటనే ఆమె పరిస్థితిని సాధారణ ఘటనగా చూడలేదు. ఇది ఒక కుటుంబం జీవితానికి సంబంధించిన విషయం అనే భావనతో వెంటనే స్పందించింది. జిల్లా స్థాయి వైద్యులతో సంప్రదింపులు జరిపి పరిస్థితిని వివరించింది. సంబంధిత వైద్య నిపుణులతో మాట్లాడి, అత్యవసర వైద్య సహాయం అందేలా చొరవ తీసుకుంది. ఆసుపత్రి వర్గాలతో సమన్వయం చేస్తూ తక్షణ చికిత్స జరిగేలా చర్యలు చేపట్టింది.వైద్యపరంగా చూస్తే, గర్భంలోని శిశువు మెడకు నాభి తాడు చుట్టుకోవడం ప్రమాదకర పరిస్థితిగా పరిగణించబడుతుంది. అంతేకాక బిడ్డ అడ్డం తిరగడం (ట్రాన్స్‌వర్స్ పొజిషన్) తల్లి ఆరోగ్యానికీ ప్రమాదమే. ఇటువంటి సందర్భాల్లో ఆలస్యం ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనల్లో ఉండగా, శిరీష మాత్రం ఆందోళన చెందకుండా వైద్యులతో సమన్వయం చేస్తూ వేగంగా స్పందించింది.ఆమె చొరవతో వైద్య బృందం వెంటనే చర్యలు చేపట్టిందని, తగిన వైద్య జాగ్రత్తల మధ్య ప్రసవం సురక్షితంగా జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. చివరకు తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా బయటపడటంతో కుటుంబ సభ్యులు ఉపశమనం పొందారు. వారి కళ్లలో ఆనందభాష్పాలు మెరిశాయి. ఇది వైద్యుల కృషితో పాటు శిరీష సమయస్ఫూర్తి వల్లే సాధ్యమైంది అని వారు భావోద్వేగంగా పేర్కొంటున్నారు.ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరూ తమ పనుల్లో నిమగ్నమై ఉంటున్న కాలంలో, ఇతరుల బాధను తన బాధగా భావించి ముందుకు రావడం అరుదుగా కనిపిస్తోంది. అలాంటి సమయంలో శిరీష చూపిన మానవత్వం ప్రత్యేకంగా నిలిచింది. జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ఒక బాధ్యత అయితే, ఒక తల్లి,బిడ్డ ప్రాణాలను కాపాడటంలో తన వంతు పాత్ర పోషించడం మానవతకు నిలువెత్తు నిదర్శనంగా మారింది.శిరీషను తెలిసిన వారు ఆమె గురించి మాట్లాడుతూ, ఆమె వార్తల కోసం మాత్రమే పరిమితమయ్యే వ్యక్తి కాదు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ నిలబడుతుంది. అవసరమైతే అధికారులతో మాట్లాడుతుంది. అవసరమైతే బాధితులకు ధైర్యం చెబుతుంది అంటున్నారు. సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం, బాధితులకు అండగా నిలవడం, ప్రజల గొంతుకగా మారడం వంటి అంశాల్లో ఆమె చురుకుగా ఉంటుందని చెబుతున్నారు.ఈ ఘటనతో జర్నలిజం వృత్తికి మరో గౌరవం దక్కిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎందుకంటే చాలా సందర్భాల్లో జర్నలిస్టులను కేవలం వార్తలను కవర్ చేసే వ్యక్తులుగా మాత్రమే చూసే పరిస్థితి ఉంటుంది. కానీ శిరీష వంటి వ్యక్తులు జర్నలిజం అంటే కేవలం వార్త రాయడం కాదు, సమాజంతో మమేకం కావడం, అవసరమైన చోట సహాయం అందించడం కూడా అని నిరూపిస్తున్నారు.ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సామాజిక మాధ్యమాల్లో కూడా శిరీషకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఒక జర్నలిస్టు ఇలా మానవత్వంతో ముందుకు రావడం గొప్ప విషయం, అమ్మ,బిడ్డ ప్రాణాలను కాపాడిన నిజమైన దేవత అంటూ పలువురు ప్రశంసిస్తున్నారు. కొందరు ఆమెను మానవత్వానికి మారుపేరు అని అభివర్ణిస్తున్నారు.అయితే ఈ ఘటనలో వైద్యుల పాత్ర కూడా ఎంతో కీలకమని పలువురు గుర్తుచేస్తున్నారు. సరైన సమయంలో సరైన వైద్య నిర్ణయం తీసుకోవడం, అత్యవసర చికిత్స అందించడం వల్లే తల్లి,బిడ్డ సురక్షితంగా బయటపడినట్లు చెబుతున్నారు. అదే సమయంలో ఆ వైద్య సహాయం అందేలా సమన్వయం చేయడంలో శిరీష పోషించిన పాత్ర ప్రత్యేకంగా నిలిచిందని అంటున్నారు.సమాజంలో మానవత్వం తగ్గిపోతోందనే విమర్శలు వినిపిస్తున్న ఈ రోజుల్లో శిరీషలాంటి వ్యక్తులు ఆశాకిరణాలుగా నిలుస్తున్నారు. మనిషి మనిషికి



అండగా ఉంటే ఎన్నో ప్రాణాలు నిలబడతాయి అనే సందేశాన్ని ఈ సంఘటన మరోసారి గుర్తుచేసింది. ఎవరి బాధనైనా మన బాధగా భావించి స్పందిస్తే సమాజం మరింత మానవీయంగా మారుతుందనే విషయం స్పష్టమవుతోంది.జర్నలిస్టు శిరీష చేసిన ఈ సేవ ఒక కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే సంఘటన. తల్లి తన బిడ్డను ఒడిలోకి తీసుకున్న ప్రతి క్షణం, కుటుంబ సభ్యులు సంతోషంగా చూసే ప్రతి సందర్భం వెనుక ఒక మహిళ చూపిన చొరవ, మానవత్వం, ధైర్యం నిలిచే అవకాశం ఉంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సమయంలో ఆశగా నిలిచిన ఆమెను కుటుంబ సభ్యులు దేవతగా భావించడం సహజమే.ఒక వార్త కోసం పరుగులు తీసే జర్నలిస్టు, అవసరమైన సమయంలో ప్రాణాలను కాపాడే వ్యక్తిగా మారడం అనేది నిజమైన మానవతకు నిదర్శనం. శిరీష చూపిన ఈ ఉదాహరణ ఇతరులకు కూడా స్ఫూర్తిగా నిలవొచ్చు. సమాజం కోసం పనిచేయడం అంటే కేవలం మాటల్లో కాదు, చేతల్లో చూపించాలి అనే సందేశాన్ని ఆమె తన పనితో చాటిచెప్పింది.తల్లి,బిడ్డను కాపాడిన ఈ ఘటన కేవలం ఒక వ్యక్తి కథ కాదు. ఇది మానవత్వం ఇంకా బతికే ఉందని చెప్పే ఒక బలమైన ఉదాహరణ. మన చుట్టూ ఉన్న బాధలను చూసి స్పందించే మనుషులు ఉన్నంతకాలం సమాజం సజీవంగా ఉంటుంది. అలాంటి సమయంలో జర్నలిస్టు శిరీష చూపిన సేవ, ధైర్యం, సమయస్ఫూర్తి నిజంగా అభినందనీయం.మొత్తంగా చూస్తే, జర్నలిస్టు శిరీష చేసిన పని ఒక వార్తకంటే పెద్దది. అది ఒక కుటుంబానికి కొత్త జీవితం ఇచ్చిన సేవ. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టు, ఒక తల్లి,బిడ్డ ప్రాణాలను కాపాడి మానవత్వానికి ప్రతీకగా నిలవడం నిజంగా గర్వకారణమే. సమాజం ఇలాంటి సేవాభావం కలిగిన వ్యక్తులను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందని మేధావులు అంటున్నారు.

# భక్తుల మనోభావాలు దెబ్బతినేలా బల్కంపేట ఆలయ ఈ.ఓ వినోద్ వ్యవహారశైలి

- బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో అధికారుల ఇష్టారాజ్యం
- భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఈ.ఓ వినోద్ వ్యవహారశైలి
- అమ్మవారి అలంకార ఫోటోలపై అంక్షలు విధించడం దురదృష్టకరం.
- ఆలయ వెబ్ సైట్లో అమ్మవారి అలంకార ఫోటోలు పెట్టేలా చర్యలు తీసుకోవాలి.





**బల్కంపేట(ప్రశ్న న్యూస్)** అత్యంత మహిమాన్వితమైన స్వయంభూ బల్కంపేట్ ఎల్లమ్మ తల్లి భక్తుల పాలిట కొంగుబంగారంగా ప్రసిద్ధి. ఈ చల్లని ఎల్లమ్మ తల్లిని దర్శించుకోవడం వల్ల అష్టాదశ శక్తిపీఠాలను దర్శించుకున్న ఫలితం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతటి మహిమాన్విత శక్తి ఉన్న అమ్మవారు ఆలయ అధికారుల తీరుతో భక్తులకు కనీస దర్శన భాగ్యం కూడా దక్కడం లేదని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా ఆలయంలో జరుగుతున్న పలు సంఘటనలతో తరతరాలుగా అమ్మవారిపై వస్తున్న నమ్మకం, అపారమైన భక్తి విశ్వాసాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం పొంచి ఉందని ఆందోళనలు వ్యక్తమవుచున్నాయి. ముఖ్యంగా దీనికి కారణం ఆలయ ఈ.ఓ. వినోద్ వ్యవహారశైలేనని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రతనిత్యం ఆలయంలో జరిగే అమ్మవారి విశిష్ట అలంకార ఫోటోలను దేవస్థానం వెబ్ సైట్లో అందుబాటులో ఉంచేవారు. దీంతో ప్రత్యక్షంగా ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకోలేని వారికి ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. కాని ఆలయ ఈ.ఓ వినోద్ అత్యుత్సాహ వైఖరి మూలంగా గత కొంత కాలంగా అమ్మవారి అలంకార ఫోటోలను వెబ్ సైట్లో అందుబాటులో ఉంచకపోవడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీంతో దేశ విదేశాలలో ఉన్న అమ్మవారి భక్తులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. అలాగే అమ్మవారి అలంకారణ ఫోటోలను సోషల్ మీడియాలో స్టేటస్ పెట్టవద్దని ఆలయ అధికారులు అంక్షలు విధించడం సనాతన ధర్మంపై విషం చిమ్మే ప్రయత్నమని పలువురు భక్తులు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఆలయ అధికారుల అత్యుత్సాహంతో లక్షలాదిగా ఎల్లమ్మ తల్లి భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, ఎల్లమ్మ తల్లిపై ఉన్న నమ్మకం, అపారమైన భక్తి విశ్వాసాలపై భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తు, అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన ఆలయ అధికారులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన ఆలయ పవిత్రతను కాపాడేందుకు చర్యలు చేపట్టి, ఆలయ వెబ్ సైట్లో అమ్మవారి అలంకార ఫోటోలను అప్ లోడ్ చేసేలా దేవాదాయశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# బోయిన్ పల్లి మార్కెట్‌ని సందర్శించిన గుడిమల్కపూర్ చైర్మన్

- గుడ్డిమల్కపూర్ మార్కెట్ త్వరలో తరలింపు, - “42”ఎకరాల విస్తీర్ణంలో సరికొత్త విధానంతో నిర్మాణం: చైర్మన్ తలారి మహేష్
- భవిష్యత్తులో ఇరవై ఎకరాల స్థలంలో పువ్వుల మార్కెట్, మరో “20” ఎకరాల్లో కూరగాయల మార్కెట్, రెండు ఎకరాల్లో మార్కెట్ కార్యాలయం నిర్మాణం చేయబోతున్నట్లు చైర్మన్ వెల్లడి.
- మరో యాభై ఏళ్ల వరకు మౌళిక సమస్యలతో ఎవ్వరికీ ఇబ్బందులు తలెత్తకుండా సరికొత్తగా నిర్మాణాలు: చైర్మన్.
- బోయిన్ పల్లి మార్కెట్ గత ఇరవై ఐదు సంవత్సరాల క్రితం ఏర్పడిన విషయం అందరికి తెలిసిందే.
- ప్రస్తుతం చిన్న చిన్న ఇబ్బందులు తలెత్తడం అందరికి తెలిసిందే.
- నగరంలో ఉన్న మార్కెట్లో సమస్యలను దృష్టిలో పెట్టుకొని గుడ్డిమల్కపూర్ మార్కెట్ రూపకల్పన జరుగుతోంది: తలారి మహేష్.

**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మహానగరంలో వ్యవసాయ మార్కెట్ యార్డులు అందరికీ తలనొప్పిగా మారాయి.ప్రస్తుతం జంటనగరాల్లో ఉన్న ప్రధాన మార్కెట్ లు సామాన్యులకు,అధికారులకు ట్రాఫిక్ జామ్ తో తలలు పట్టుకుంటున్నారు. ఒక పక్క సాధారణంగా నిత్యం రోడ్లు ఎక్కే ప్రైవేటు వాహనాలు, (ప్రజా రవాణా) పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ వాహనాలతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్న విషయం విదితమే!అందుకే గతంలో సిఎం నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మొండా మార్కెట్ ని రెండున్నర దశాబ్దాల క్రితం బోయిన్ పిల్లికి తరలించారు.అప్పుడు సికింద్రాబాద్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్య కాస్త ఉపసమనం కల్పించింది.ఇదే క్రమంలో గత ఏడాది గుడ్డిమల్కపూర్ మార్కెట్ ని అప్పా జంక్షన్ అజీజ్ నగర్ శివారు ప్రాంతానికి తరలిస్తున్నారు.అలాగే మరిన్ని సౌకర్యాలతో నూతన మార్కెట్ కి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని చైర్మన్ తలారి మహేష్ సిఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.సానుకూలంగా స్పందించిన సిఎం సంబంధింత శాఖ మంత్రికి ఆదేశాలు జారీచేశారు.ఈ క్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు కొన్ని రోజుల క్రితం నగర శివార్లలో ఉన్న అప్పా జంక్షన్ అజీజ్ నగర్ లో





“42”ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి గుడ్డిమల్కపూర్ మార్కెట్ తరలింపుకు పచ్చ జెండా ఊపారు.ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మహేష్,సభ్యులు మున్నీర్ బాయ్ కలిసి జంటనగరాల్లో ఉన్న ప్రధాన మార్కెట్లను పరిశీలిస్తున్నారు. అయితే నిన్న మధ్యాహ్నం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కి వచ్చి చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు,సెక్రటరీ ఈ.వెంకటేశాన్నీ కలిశారు.తదనంతరం బోయిన్ పల్లి మార్కెట్ లో ఉన్న షాపులను పరిశీలిస్తూ,ప్రతి దుకాణం విస్తీర్ణం ఎంత ఉందో మార్కెట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.అలాగే యార్డులో ఎన్ని షాపులున్నాయి.మౌళిక సదుపాయాల కల్పన ఏ విధంగా ఉందో అడిగారు. బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, సెక్రటరీ ఈ.వెంకటేశం మాట్లాడుతూ బోయిన్ పల్లి మార్కెట్ లో “శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం, ”174”దుకాణాలు,రైతు విశ్రాంతి భవనం, క్యాంటీన్,తెలంగాణ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ శిక్షణ కార్యాలయం,బయో గ్యాస్ కేంద్రం,నీటి సరఫరా కేంద్రాలు, మరుగు దొడ్లు,విశాలమైన పార్కింగ్ స్థలం తదితర విషయాలపై ఇరువురు చైర్మన్లు గంటన్నరపాటు మార్కెట్ పై చర్చించారు. అలాగే బోయిన్ పల్లి మార్కెట్ వార్షిక ఆదాయం సుమారు”14”కోట్లు పై చిలుకు,అదే గుడ్డి మల్కపూర్ మార్కెట్ వార్షిక ఆదాయం పదికోట్లు అన్నారు తలారి మహేష్.ఏదేమైనా కాంగ్రెస్ హయాంలో గుడ్డి మల్కపూర్ మార్కెట్ కి మహర్దశ పలికింది,అలాగే త్వరలో నిర్మాణం కూడా పూర్తి అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు చైర్మన్ మహేష్.

# గజ్వేల్ బస్టాండ్‌ను వెంటనే ప్రారంభించాలి

## - వంటేరు ప్రతాప్ రెడ్డి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ పట్టణ బస్టాండ్‌ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రయాణికులు, విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు, అధికారులు బస్టాండ్ ప్రారంభానికి సమయం కేటాయించడం లేదని విమర్శించారు.మాజీ ముఖ్యమంత్రి కే . చంద్రశేఖర్ రావు ప్రభుత్వ హయాంలో ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌కు రూ.4 కోట్లు, గజ్వేల్ బస్‌బే మరియు బస్టాండ్ నిర్మాణాలకు కలిపి దాదాపు రూ.12 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తిచేశారని పేర్కొన్నారు. అయితే నిర్మాణం పూర్తై మూడు నెలలు గడిచినా ప్రస్తుత ఎ . రేవంత్ రెడ్డి ప్రభుత్వం బస్టాండ్ ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు.45 డిగ్రీల ఎండలో ప్రయాణికులు బస్సుల కోసం బయట వేచి ఉండాల్సి వస్తోందని, మహిళలు, విద్యార్థులు, రవాణాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే బస్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అసంపూర్తిగా ఉన్న ప్రజ్ఞాపూర్ బస్టాండ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కోట మైసమ్మ రోడ్డును పూర్తి చేయాలని, 100 మీటర్లు మిగిలిపోయిన రింగ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.

కేసీఆర్ ప్రభుత్వం రూ.100 కోట్లతో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఇప్పటికీ కనెక్షన్లు ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన యూజీడీ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.గజ్వేల్ పట్టణంలో పూర్తి స్థాయి మున్సిపల్ కమిషనర్ లేకపోవడం వల్ల పాలనలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అపరిశుభ్రత పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే శాశ్వత కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలపై కూడా స్పందించిన వంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ పట్టణంలో రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని నిరసన తెలుపుతూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం 80 శాతం వరి ధాన్యం కొనుగోలు చేశామని చెప్పడం అసత్యమని, ఇప్పటివరకు 20 శాతం కూడా కొనుగోలు కాలేదని ఆరోపించారు.నియోజకవర్గంలో 120కి పైగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ఒక్కో కేంద్రం నుంచి రెండు లారీల ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని తెలిపారు. గన్నీ బ్యాగులు, లారీలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందనా రవీందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నమాజ్ మీరా, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు గోలి సంతోష్, కోట బాబు, మరికంటి కనకసేన, మాజీ కౌన్సిలర్లు దుర్గాప్రసాద్, శ్యామల మల్లేశం, మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సోషల్ మీడియా వేదికగా సీపీ సజ్జనార్‌కు
# అనసూయ ఫిర్యాదు

తనను అసభ్యకరరీతిలో చూపిస్తూ 'ఏఐ' ఫొటోలను సృష్టిస్తున్నారంటూ ప్రముఖ తెలుగు యాంకర్, నటి అనసూయ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌ను ట్యాగ్ చేశారు. ఒక 'ఎక్స్' హ్యాండిల్ తన ఏఐ జనరేటెడ్ ఇమేజ్‌లను పోస్టు చేస్తోందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇలాంటి వాటిని పట్టించుకోకుండా ఉండాలని తాను ప్రయత్నించానని ఆమె పేర్కొన్నారు. కానీ ఈ 'ఎక్స్' హ్యాండిల్ ద్వారా తరచూ తన ఫొటోలను పోస్టు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అనసూయ ఫిర్యాదుపై సజ్జనార్ స్పందించారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ బ్రాంచ్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయమని సూచించారు. సమన్వయం చేసుకోవాలంటూ 'హైదరాబాద్ సిటీ పోలీస్' ఖాతాను సజ్జనార్ ట్యాగ్ చేశారు.



## పెళ్లి అయ్యిందని చెప్పడంతో
# చేజారిన సినిమా ఛాన్స్..

గ్లామర్ ఇండస్ట్రీలో పెళ్లి, రిలేషన్‌షిప్‌లు నటీమణుల కెరీర్‌పై ప్రభావం చూపుతాయనే చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా హీరోయిన్లు, యాంకర్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రాణించాలనుకునే మహిళలకు వ్యక్తిగత జీవితం కూడా కొన్ని సందర్భాల్లో కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు వినిపిస్తుంటాయి. తాజాగా ఈ అంశంపై ప్రముఖ తెలుగు యాంకర్, బిగ్ బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన ఒక సంఘటనను పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఓ పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్స్ ఇచ్చానని, నటన, లుక్స్ పరంగా తాను ఎంపికయ్యాననే సంకేతాలు కూడా వచ్చాయని తెలిపింది. మేకర్స్ తనను ఆ పాత్రకు సరైన ఎంపికగా భావించారని చెప్పింది. అయితే ఫైనల్ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు వచ్చాయని, తనకు పెళ్లైందా అని అడిగారని వెల్లడించింది. దానికి తాను ఎలాంటి సంకోచం లేకుండా "అవును, నాకు పెళ్లైంది" అని నిజాయితీగా సమాధానం చెప్పానని తెలిపింది. కానీ ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి పూర్తిగా మారిపోయిందని స్రవంతి పేర్కొంది. షూటింగ్ కోసం చెన్నై రావాలని, అక్కడ అడ్వాన్స్ తీసుకోవాలని ముందుగా చెప్పినట్లు గుర్తు చేసుకుంది. అయితే పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో కాల్ చేస్తామని చెప్పిన వారు తిరిగి స్పందించలేదని తెలిపింది. ఆ తర్వాత ఆ సినిమా అవకాశం తనకు రాలేదని, తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా ఆగిపోయిందని తెలిసిందని చెప్పుకొచ్చింది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంటర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ పాపులారిటీ వచ్చింది. తర్వాత తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ నాన్-స్టాప్‌లో పాల్గొని ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ప్రస్తుతం సినిమా ఆడియో లాంచ్‌లు, సెలబ్రిటీ ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ బిజీగా ఉంది. ఇటీవల నటిగానూ తన ప్రయాణాన్ని ప్రారంభించిన స్రవంతి, సోషల్ మీడియాలో కూడా తన గ్లామరస్ ఫోటోషూట్లతో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంటోంది.

## ఆ వైరల్ వీడియో, ఫొటోలు
# నావి కావు..

### - బాధ్యులపై లీగల్ యాక్షన్ తీసుకుంటా: రుక్మిణి వసంత్

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తన బికినీ ఫోటోషూట్ చిత్రాలపై నటి రుక్మిణి వసంత్ తీవ్రంగా స్పందించారు. ఆ చిత్రాలు పూర్తిగా నకిలీవని, ఏఐ టెక్నాలజీతో సృష్టించినవని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కొన్ని రోజులుగా, గ్రీన్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లోకి వెళుతున్నట్లుగా ఉన్న ఓ మహిళ ఫొటోలు, వీడియో క్లిప్‌లు ఆన్‌లైన్‌లో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. చాలామంది నెటిజన్లు ఇది రుక్మిణి వసంత్ 'మొదటి బికినీ షూట్' అంటూ ప్రచారం చేయడంతో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో రుక్మిణి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా దీనిపై పూర్తి వివరణ ఇచ్చారు. "నా పేరుతో సర్క్యులేట్ అవుతున్న కొన్ని ఏఐ-జనరేటెడ్ చిత్రాలు నా బృందం దృష్టికి వచ్చాయి. ఆ చిత్రాలు పూర్తిగా ఫేక్, కల్పితం అని నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. వాటికి నాకు ఎలాంటి సంబంధం లేదు" అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ కంటెంట్‌ను సృష్టించి, వ్యాప్తి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని, ఇది వ్యక్తిగత గోప్యతా హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫేక్ చిత్రాలను రూపొందించి, వ్యాప్తి చేసిన వారిపై తన బృందం సైబర్ క్రైమ్, చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తుందని రుక్మిణి తెలిపారు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ప్రోత్సహించవద్దని, ఆ కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ వివాదం పక్కన పెడితే, రుక్మిణి వసంత్ తన కెరీర్‌పై పూర్తి దృష్టి సారించారు. ఆమె ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ యశ్‌తో కలిసి 'టాక్సిక్' చిత్రంలో నటిస్తున్నారు. దీనితో పాటు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న 'డ్రాగన్' సినిమాలో కూడా ఆమె హీరోయిన్. ఇలా కెరీర్‌లో ప్రస్తుతం ఆమె వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.





## ప్రాచీన రహస్యాల
# నాగబంధం

విరాట్‌కర్ణ కథానాయకుడిగా నటిస్తున్న మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం నిర్మాణదశ నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నది. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో విరాట్‌కర్ణ చేతిపై పడగ విప్పిన సర్పం, మరో చేతితో ఆయన కత్తి పట్టుకొని తీక్షణమైన చూపులతో కనిపిస్తున్నారు. భారతీయ పురాణాలు, ప్రాచీన రహస్యాలు, దైవిక శక్తుల మహిమలు కలబోసిన ఈ కథలో విజువల్స్ అబ్బురపరుస్తాయని, ప్రపంచస్థాయి సాంకేతికాంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, మునుపెన్నడూ చూడని పోరాట ఘట్టాలతో ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్ర హిందీ హక్కులను జీ స్టూడియోస్ కొనుగోలు చేసింది. నభానటేష్, ఐశ్వర్యమీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్ తదితరులు చిత్ర తారాగణం.

# చీరా చొక్కా చిక్కడిపోవాలో..



అగ్ర హీరో రామ్‌చరణ్ నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'పెద్ది' జూన్ 4న విడుదల కానున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ సినిమా హ్యాజ్ బజ్‌ని క్రియేట్ చేస్తున్నది. ముఖ్యంగా చికిరీ చికిరీ, రైరైరారా సాంగ్స్ సోషల్ మీడియాలో సంచలనాలుగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని మూడో పాటను మేకర్స్ నేడు(శనివారం) విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా ఈ పాట ప్రోమోను శుక్రవారం విడుదల చేశారు. 'హెల్లో హెల్లో హెల్లో హెల్లెల్లో.. బావా.. చీరా చొక్కా చిక్కడిపోవాలో..' అంటూ సాగే ఈ పాటను దర్శకుడు బుచ్చిబాబు సానా అత్యంత ఎనర్జిటిక్‌గా, కలర్‌ఫుల్‌గా చిత్రీకరించినట్టు ప్రోమో చూస్తుంటే తెలుస్తున్నది. పవర్‌ఫుల్ డ్రమ్ బీట్స్, క్యాచీ రిథమ్‌తో జాతర వాతావరణాన్ని తలపించేలా ఈ ప్రోమో సాగింది. రామ్‌చరణ్, శ్రుతిహాసన్, జాన్వీ కపూర్‌లపై ఈ పాటను చిత్రీకరించారు.స్టైలిష్ స్టెప్పులతో, అద్భుతమైన స్క్రీన్ ప్రజెన్స్‌తో ముగ్గురూ ఆకట్టుకున్నారు. శనివారం భోపాల్‌లో జరిగే భారీ మ్యూజికల్ ఈవెంట్‌లో పూర్తి పాటను విడుదల చేస్తారు. శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో జగపతిబాబు, దివేందుశర్మ, బోమన్ ఇరానీ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేల్, సహ నిర్మాత: ఇషాన్ సక్సేనా, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాత: వెంకటసతీశ్ కిలారు, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

## మే 24న వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం: టిటిడి

### - నారాయణవనంలో దివ్యంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయ శుద్ధి మహోత్సవం



**నారాయణవనం(ప్రశ్న న్యూస్)** శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 8.15 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పవిత్ర కార్యక్రమం జరుగనుంది. మే 28 నుండి జూన్ 5వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ పవిత్రత, శోభను మరింత పెంపొందించే ఉద్దేశంతో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆలయ సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను శుద్ధి జలాలతో పరిశుభ్రం చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలను కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించనున్నారు.

## కనకదుర్గమ్మ అమ్మవారికి ఘనంగా అభిషేకం

### - ముఖ్య అతిథిగా పాల్గొన్న టి నర్సారెడ్డి



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** జగదేవపూర్ పెద్దమ్మతల్లి, మహంకాలమ్మతల్లి కనకదుర్గమ్మతల్లి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈరోజు కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తుల ప్రార్థనలు, ప్రత్యేక పూజల నడుమ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ అభిషేక కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే టీ . నర్సా రెడ్డి , ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కొత్త దయాకర్ రెడ్డి, అమర రాము, ఎండీ అజీజ్, పెద్దమోళ్ల రాజయ్య, కొంపెల్లి కరుణాకర్, రాగుల రాజు, ఇమ్మడి జహంగీర్, బచ్చ లి నర్సింలు, బలరాం, రాగుల నర్సింలు, కొంపెల్లి కృష్ణ, రాయరం చంద్రయ్య, కొంపెల్లి నర్సి ములు, రాగుల బాలనర్సయ్య, సదాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. జగదేవపూర్ ముది రాజ్ సంఘంమహిళలు,యువకులుభారీసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వడ్ల కొనుగోలు చేయాలని ఎన్‌హెచ్-44పై రైతుల నిరసన



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** మనోహరాబాద్ మండల కేంద్రంలో రైతులు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి వడ్ల కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నేషనల్ హైవే-44పై బైఠాయించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మనోహరాబాద్‌లోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సమయంలో రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. రైతుల సమస్యలను తెలుసుకున్న అనంతరం వారితో కలిసి ఎన్‌హెచ్-44పై బైఠాయించి నిరసన చేపట్టినట్లు చెప్పారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి ఎ . రేవంత్ రెడ్డి ను డిమాండ్ చేశారు. రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయలేని ప్రభుత్వం గద్దె దిగాలని అన్నారు. రైతులతో విభేదించిన ఏ ప్రభుత్వం కూడా నిలబడలేదని, రైతుల ఆవేదన ప్రభుత్వానికి తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. రైతులు రోడ్లపైకి వచ్చి తమ గోడును నిరసనల రూపంలో వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే 80 శాతం వడ్ల కొనుగోలు పూర్తయ్యిందని చెప్పడం అసత్యమని, వాస్తవానికి 30 శాతం కూడా కొనుగోలు కాలేదని ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాల రైతులు భారీగా పాల్గొన్నారు. ఈ నిరసన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు.

## కార్మికుల కనీస వేతనాల పెంపుపై సీఎం, కార్మిక శాఖ మంత్రికి పాలాభిషేకం



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** గజ్వేల్ పట్టణంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ . రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే టీ . నర్సా రెడ్డి , సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు టీ . ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 1 కోటి 11 లక్షల మంది కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. పెంచిన కనీస వేతనాలు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయని పేర్కొన్నారు. కార్మికుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి కృతజ్ఞతగా గజ్వేల్ పట్టణంలో సీఎం, కార్మిక శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, గజ్వేల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, కౌన్సిలర్లు రమేష్, గుంటుకు శీను, వర్గల్ మోహన్, కొండల్ రెడ్డి, గాడేపల్లి శ్రీనివాస్, మతీన్, అజహార్, జహీర్, జకీర్, మహేష్ షకీల్ పాష తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఫ్యాక్షన్, నేరమయ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ కుటుంబమే

- పయ్యావుల కేశవ్, బీజేపీ ఎంపీ సీఎం రమేష్ - జగన్ హయాంలో ప్రతి వ్యవస్థ ప్రతి రంగం ప్రతి ప్రాంతం పైనా గొడ్డలివేటు
- జగన్ బాధితుడు కాదు నేర చరిత్ర కలిగిన నిందితుడు - పులివెందులలో రాజారెడ్డి అకృత్యాలపై త్వరలోనే పుస్తకం
- మంచోడినంటూ జగన్ సెల్ఫ్ సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నాడు - తండ్రిని ముద్దాయిని చేసిన వారికి పదవులిచ్చి జగన్ సత్కరించారు
- వైఎస్ ఫ్యామ్లీ చరిత్రను యువత తెలుసుకోవాలి వాస్తవాలు గుర్తించాలి - పొక్లెయిన్లతో నాడు కూల్చివేతలు నేడు నిర్మాణాలు
- తన క్రిమినల్ చర్యలను కప్పిపుచ్చుకునేందుకే శాంతిదూతలా జగన్ నటిస్తున్నాడు - ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్సులో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీజేపీ ఎంపీ సీఎం రమేష్

**అమరావతి(ప్రశ్న న్యూస్)** జగన్ ఎన్నటికీ బాధితుడు కాదని ఆయనో నిందితుడని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. తాను మంచోడినని చెప్పుకుంటూ జగన్ మోహన్ రెడ్డి సెల్ఫ్ సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. శనివారం విజయవాడ ఆర్ అండ్ బి గెస్ట్ హౌసులో అనకాపల్లి బీజేపీ ఏంపీ సీఎం రమేష్ తో కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిద్దరూ ఇటీవల జగన్ చేసిన కామెంట్లపై విరుచుకుపడ్డారు. పులివెందులలో రాజారెడ్డి చేసిన అకృత్యాల్లో కొన్నింటిని వివరించారు. రాజారెడ్డి చేసిన అకృత్యాలు నేటి తరానికి అర్థమయ్యే విధంగా ఓ పుస్తకాన్ని వేసే ఆలోచనలో ఉన్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ జగన్ బెంగళూరు ప్యాలెస్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినప్పుడల్లా సరికొత్త, వింత వాదనలను తెరపైకి తెస్తుంటారు. గతంలో తనను సన్మానించాలని కోరిన జగన్, నిన్నటికి నిన్న ప్రెస్ మీట్ పెట్టి తనకంటే ఉత్తముడు, మంచోడు లోకంలోనే లేడంటూ సొంతంగా 'సెల్ఫ్ సర్టిఫికేట్' ఇచ్చుకున్నారు. సొంత బాబాయ్ వై.ఎస్. వివేకాపై గొడ్డలిపోటు వేసి గుండెపోటుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన జగన్ చరిత్ర అందరికీ తెలిసిందే. వివేకా హత్య కేసులో ఏం జరిగిందో ఇవాళ నిక్కరు వేసుకునే చిన్న పిల్లాడిని అడిగినా స్పష్టంగా చెబుతాడు. అలాంటి సున్నితమైన అంశాల్లో కూడా జగన్ పచ్చి అబద్దాలు ఆడుతూ పబ్బం గడుపుకుంటున్నారు."అని పయ్యావుల మండిపడ్డారు.



# మిథున లగ్నంలో దివ్యంగా ప్రారంభమైన శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు: టిటిడి

- వేదఘోషలు, గోవింద నామస్మరణల నడుమ ఘనంగా ధ్వజారోహణం - ముక్కోటి దేవతలకు ఆహ్వానంగా ధ్వజారోహణ మహోత్సవం
- ఆధ్యాత్మిక శోభతో ముస్తాబైన తిరుపతి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు - పెద్దశేష వాహనంపై భక్తులను కటాక్షించనున్న శ్రీ గోవిందరాజస్వామి

**తిరుపతి (ప్రశ్న న్యూస్)** వేదఘోషలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం మిథున లగ్నంలో ధ్వజారోహణ మహోత్సవంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7.35 నుండి 8.49 గంటల మధ్య గరుడ చిత్రంతో అలంకరించిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాలకు శుభారంభం పలికారు. అనంతరం స్వామివారి ఆస్థానం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు వెండి తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ దివ్య ఊరేగింపుతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారే స్వయంగా పర్యవేక్షిస్తారనే ఆధ్యాత్మిక విశ్వాసం భక్తులను అలరించింది. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షాబంధనం తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించి 18 గణాలు, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. తదనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించగా భక్తులు భక్తి పరవశు లయ్యారు. సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనసేవ వైభవంగా జరుగనుంది. పెద్దశేష వాహనంపై స్వామివారు మాడవీధుల్లో



విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వేసవి దృష్ట్యా చలువ పందిళ్లు, వైట్ పెయింటింగ్, రంగవల్లులు, విద్యుత్ దీపాలంకరణలు, ఆకర్షణీయ పెయింటింగ్స్, పుష్పాలంకరణలతో ఆలయ పరిసరాలను ఆధ్యాత్మిక శోభతో తీర్చిదిద్దింది. అదేవిధంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనుంజయరావు, రంజిత్ , అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైకుంఠనాధుడి అలంకారంలో భక్తులను కటాక్షించిన శ్రీదేవి భూదేవి సమేత గోవిందుడు

- గోవింద నామస్మరణలతో మారుమోగిన తిరుపతి మాడవీధులు - మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనల నడుమ వైభవమైన పెద్దశేష వాహనసేవ
- భక్తి తరంగాల్లో తేలియాడిన శ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుపతి(ప్రశ్న న్యూస్)** శ్రీ గోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొలి రోజు రాత్రి పెద్దశేష వాహనంపై వైకుంఠనాధుడి అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు దివ్య మంగళ విహారం చేసి భక్తులను అనుగ్రహించారు. ఆదిశేషునిపై శేషశాయిగా వెలసిన స్వామివారు అపూర్వ దివ్యకాంతులతో భక్తులను పరవశింపజేశారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందుండగా మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజ నలు, గోవింద నామస్మరణల నడుమ స్వామి వారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు కనువిందు చేశారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు సమర్పిస్తూ, కర్పూర హారతులు ఇస్తూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని సేవించుకున్నారు. గోవింద నామాలతో మారుమోగిన మాడవీధులు ఆధ్యాత్మిక పారవశ్యానికి నిలయంగా మారాయి. శేషుడు స్వామివారికి మంచం, పరుపు, ఛత్రంగా సేవలందిస్తూ "శేషశాయి" మహిమను సార్థకం చేస్తున్నాడు. శేషవాహన సేవ ద్వారా "శేషునిలా నిత్యం భగవంతునికి సేవ చేస్తూ ధర్మమార్గంలో నడిచే వారికి దైవానుగ్రహం లభిస్తుంది" అనే ఆధ్యాత్మిక సందేశాన్ని స్వామివారు భక్తులకు బోధిస్తున్నారని ఆగమ పండితులు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండోవ రోజు ఆదివారం ఉదయం 7 గం.లకు చిన్న శేష వాహనం, రాత్రి 7 గం.లకు హంస వాహనంపై స్వామి వారు విహరించి భక్తులను కటాక్షిస్తారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనుంజయరావు, రంజిత్, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సీఎం కప్ జూడో పోటీల్లో మెడల్ సాధించిన కొండపాక విద్యార్థికి సన్మానం


**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ప్రగతి పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక యువజన వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి సీఎం కప్ జూడో పోటీల్లో మెడల్ సాధించిన విద్యార్థిని ఘనంగా సన్మానించారు. కొండపాక మండలం జప్తి నాచారం గ్రామానికి చెందిన చింతల హర్షిత్ గౌడ్, తండ్రి శ్రీనివాస్ గౌడ్, కొండపాక మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. చదువులతో పాటు జూడో క్రీడలో ప్రతిరోజూ సాధన చేస్తూ ప్రతిభ కనబరుస్తున్నాడు. ఇప్పటికే రెండు సార్లు రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొన్నాడు. ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు గచ్చిబౌలిలోని గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ జూడో పోటీల్లో -60 కేజీల విభాగంలో హర్షిత్ గౌడ్ కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీవైఎస్‌వో శ్రీనివాస్ రెడ్డి హర్షిత్ గౌడ్‌ను అభినందించి సన్మానించారు. అలాగే సిద్దిపేట జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు నంట శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గన్నె భరత్ రెడ్డి, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగార్జునసాగర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తోటి విద్యార్థులు, క్రీడాకారులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు హర్షిత్ గౌడ్ విజయాన్ని అభినందించారు.



# విఐపీ దర్శనాల పేరిట తిరుమలలో టికెట్ల దందా.?

## భక్తి ముసుగులో బ్లాక్ మార్కెట్ వ్యాపారం.?

- సామాన్య భక్తుల హక్కులను అమ్ముకుంటున్న ప్రజాప్రతినిధులపై ఆగ్రహం
- వీఐపీ లే బ్లాక్ టికెట్ల దందాకు సహకరిస్తే ఎలా.?
- చివరికి వెంకన్న విఐపి పాసులను కూడా వ్యాపారం చేసుకోవడమా రామ రామ




తిరుపతి (ప్రశ్న న్యూస్) తిరుమలలో శ్రీవారి దర్శనం ఇప్పుడు భక్తి కంటే డబ్బు ఆధారంగా మారిపోయిందన్న ఆరోపణలు రోజురోజుకు తీవ్రం అవుతున్నాయి. ఒకప్పుడు భక్తి, నియమాలు, నిబద్ధతలకు ప్రతీకగా నిలిచిన తిరుమల తిరుపతి దేవస్థానం ఇప్పుడు విఐపీ బ్రేక్ దర్శనాల పేరిట భారీ వ్యాపార కేంద్రంగా మారిందని భక్తులు మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాన్య భక్తులకు కూడా సులభ దర్శనం కల్పించాలని భావించి కొంతమంది వీఐపీలకు ప్రత్యేక దర్శన పాసులు కేటాయించినా, అవే ఇప్పుడు బ్లాక్ మార్కెట్ టికెట్లుగా మారాయని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ముందుగానే బుక్ అయ్యే విఐపీ పాసులు

దాదాపు మూడు నుంచి ఆరు నెలల ముందుగానే విఐపీ బ్రేక్ దర్శనాలు బుక్ అయిపోతున్నాయని భక్తులు చెబుతున్నారు. కానీ వాస్తవంగా ఆ టికెట్లు నిజమైన భక్తుల చేతికి చేరుతున్నాయా.? లేక మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లి లక్షల రూపాయల దందాగా మారుతున్నాయా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కొక్క ఎమ్మెల్యే, ఎంపీ, టీటీడీ డైరెక్టర్లకు కేటాయించే పాసులు భారీ ధరలకు అమ్ముడవుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వీఐపీ ల పేరుతో ఉన్న టికెట్లను లక్షల్లో అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### భక్తి కాదు, వ్యాపారం అంటున్న భక్తులు

శ్రీవారి దర్శనం కూడా డబ్బున్నవారికేనా.? అని సామాన్య భక్తులు ప్రశ్నిస్తున్నారు. తిరుమల కొండపై సాధారణ భక్తుడు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తుండగా, డబ్బు చెల్లించిన వారికి మాత్రం నేరుగా విఐపీ బ్రేక్ దర్శనం కల్పించడం అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుమలలో పని చేసే కొంతమంది ఉద్యోగులకు జీతాల కంటే టికెట్ల దందానే పెద్ద ఆదాయ వనరుగా మారిందని భక్తులు ఆరోపిస్తున్నారు. కొంతమంది వీఐపీ టికెట్లను తమ పరిధిలో ఉన్న భక్తులకు లేదా ప్రజలకు ఇవ్వాలి కానీ ఏకంగా తిరుమలలో ఉన్న బ్రోకర్లకు అందించి దానిని కూడా సొమ్ము చేసుకోవడం అంత దుర్మార్గం మరొకటి లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రోజుకు కోట్లలో టికెట్ల బ్లాక్ మార్కెట్.?

విఐపీ దర్శనాల పేరుతో రోజుకు కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరుగుతున్నాయనే ప్రచారం వినిపిస్తోంది. ఇది అతిశయోక్తి కాదని, తిరుమలకు తరచూ వెళ్లే ప్రతి భక్తుడికి అక్కడి పరిస్థితులు తెలుసని అంటున్నారు. ప్రజాప్రతినిధులు, డైరెక్టర్లు, మధ్యవర్తులు కలిసి భక్తుల విశ్వాసాన్ని వ్యాపారంగా మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత ఇంటెలిజెన్స్ వ్యవస్థ కలిగిన ప్రభుత్వం ఈ విషయాలు సేకరించలేదా మరి ఇంటెలిజెన్స్ అధికారులు తిరుమలలో జరుగుతున్న టికెట్ల అక్రమ వ్యాపారంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాలేదా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ఈ అక్రమ టికెట్ల దందా వచ్చిన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.



### ప్రభుత్వం ఎందుకు మౌనం.?

ఇంత పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నా చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ లో ఉన్న దేవాలయాల పరిస్థితి మారుతుందని ఆశించిన భక్తులకు నిరాశే ఎదురైందని అంటున్నారు. "సామాన్యుడికి రెండు గంటల్లో దర్శనం" అన్న మాటలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శిస్తున్నారు. విఐపి బ్రేక్ దర్శనం టికెట్లు బ్లాక్ మార్కెట్లో దాదాపు 3,000 నుండి 10వేల వరకు అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### విచారణ కమిటీ వేయాలన్న డిమాండ్..

విఐపీ బ్రేక్ దర్శనాల కేటాయింపులపై పూర్తి స్థాయి విచారణ జరపాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఎవరికెన్ని పాసులు కేటాయిస్తున్నారు.? అవి నిజంగా ఉపయోగపడుతున్నాయా..? లేక బ్లాక్ మార్కెట్‌లో అమ్ముడవుతున్నాయా.? అనే విషయాలపై పారదర్శక దర్యాప్తు అవసరమని అభిప్రాయపడుతున్నారు. శ్రీవారి టికెట్లు అమ్ముకోవడం కన్నా మహాపాపం ఇంకేముంటుంది.?అని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### భక్తుల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా.?

తిరుమల అనేది కోట్లాది మంది హిందువుల విశ్వాసానికి ప్రతీక. అలాంటి పవిత్రక్షేత్రంలో దర్శనాలనే వ్యాపారంగా మార్చేస్తే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని ఆధ్యాత్మిక వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీటీడీ అధికారులు కఠిన చర్యలు తీసుకుని విఐపీ దర్శనాల దందాపై ఉక్కుపాదం మోపాలని భక్తులు కోరుతున్నారు.

# సీఎం పర్యటనతో యాదగిరిగుట్టలో భక్తుల అవస్థలు

- కొండమీదికి వెళ్లే బస్సు సర్వీస్‌లను ఆపడంతో వృద్ధులు మహిళల అవస్థలు
- తాగునీరు సౌకర్యం లేకపోవడంతో అల్లాడిన భక్తులు
- ముఖ్యమంత్రి రాక దేవుడెరుగు భక్తులకు ప్రత్యక్ష నరకం చూపించిన అధికారులు
- సీఎం రేవంత్ రెడ్డి దర్శనం తర్వాతే సామాన్యుల భక్తులకు దర్శనం
- గంటలకొద్దీ క్యూ లైన్ లో నిలబడ్డ మహిళలు వృద్ధులు చిన్నపిల్లలు
- వీఐపీలు రాకతో సామాన్య ప్రజలకు ప్రత్యక్ష నరకమే
- ముఖ్యమంత్రి యాదగిరిగుట్టకు వచ్చిన భక్తులకు తాగునీరు ఏర్పాటు చేయని ఆలయ అధికారులు









యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్)యాదగిరిగుట్ట లోని ప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు వేసవి సెలవుల ఆలయానికి భారీగా కారణంగా భక్తులు తరలివస్తుండగా మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు విధించిన ఆంక్షలు సామాన్య భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సీఎం భద్రతా ఏర్పాట్ల పేరుతో యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కొండ కింద నుంచి పైకి భక్తులను ఉచితంగా తీసుకెళ్లే బస్సు సర్వీసులను అకస్మాత నిలిపివేయడంతో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చిన కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయి. కాలినడకన కొండపైకి వెళ్లలేని వారు ఎండలోనే గంటల తీసుకెళ్లే బస్సు సర్వీసులను అకస్మాత్తుగా నిలిపివేయడంతో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చిన కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయి. కాలినడకన కొండపైకి వెళ్లలేని వారు ఎండలోనే గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవి ఎండ తీవ్రతకు తోడు త్రాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కూడా సరిగా లేకపోవడంతో భక్తులు అల్లాడిపోతున్నారు.

దేవాదాయ శాఖ, పోలీస్ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎంతో కష్టపడి కొండపైకి చేరుకున్న భక్తులకు దర్శనం కూడా దూరమైంది. సీఎం రేవంత్ రెడ్డి దర్శనం పూర్తయ్యే వరకు సామాన్య భక్తులను ఆలయంలోకి అనుమతించబోమని అధికారులు చెప్పడంతో క్యూలైన్లలో గంటల తరబడి చిన్నారులతో పాటు భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. "స్వామివారి దర్శనం కోసం ఎంతో దూరం నుంచి వస్తే సీఎం పర్యటన పేరుతో మమ్మల్ని ఇబ్బ పెడుతున్నారు. ఉన్న బస్సులను కూడా నిలిపివేశారు. సామాన్య భక్తుల కష్టాలు ఎవరికి కనిపించడం లేదా?" అంటూ పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు

## భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర కీలకం

- ఐసీఏఐ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో చార్టర్డ్ అకౌంటెంట్ల (సీఏ) పాత్ర అత్యంత కీలకంగా మారుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేటీఆర్ మాట్లాడుతూ, చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచించారు. సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాలానుగుణంగా కృత్రిమ మేధ (ఏఐ)ని వృత్తిలో భాగంగా చేసుకోవాలని ఆయన అన్నారు. మున్ముందు పన్నులు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో సీఏల అవసరం చాలా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని మరవకూడదని సూచించారు.

## భవిష్యత్ యుద్ధాలు బహుముఖంగా ఉంటాయి

- సీడీఎస్ అనిల్ చౌహాన్




షిర్డీ (ప్రశ్న న్యూస్) భవిష్యత్తులో జరిగే యుద్ధాలు కేవలం భూమి, సముద్రం, ఆకాశానికే పరిమితం కావని, వాటితో పాటు సైబర్‌స్పేస్, కాగ్నిటివ్ (జ్ఞాన) రంగాల్లోనూ జరుగుతాయని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. శనివారం మహారాష్ట్రలోని షిర్డీలో ఎన్ఐబీఈ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆధునిక యుద్ధాలు సంప్రదాయ బలగాలపై మాత్రమే ఆధారపడి ఉండవని జనరల్ చౌహాన్ అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, డ్రోన్లు, సైబర్ వ్యవస్థల వంటి అధునాతన సాంకేతికతలు భవిష్యత్ యుద్ధ క్షేత్రాన్ని నిర్దేశిస్తాయని వివరించారు. "యుద్ధభూమి ఇకపై భౌగోళిక సరిహద్దులకే పరిమితం కాదు. సమాచార నెట్‌వర్క్‌లు, డిజిటల్ వ్యవస్థలు కూడా అందులో భాగమే" అని ఆయన తెలిపారు. సాంకేతిక ఆవిష్కరణ, వేగవంతమైన అనుసరణ సామర్థ్యమే భవిష్యత్ ఘర్షణల్లో వ్యూహాత్మక ప్రయోజనాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు షిర్డీ విశ్వాసానికి, ఆధ్యాత్మికతకు ప్రసిద్ధి చెందిందని, నేటి నుంచి రక్షణ తయారీ, పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలకు కూడా కేంద్రంగా గుర్తింపు పొందుతుందని జనరల్ చౌహాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది విశ్వాసం, భవిష్యత్ సాంకేతికతల అద్భుతమైన కలయిక అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా దేశీయ రక్షణ తయారీ రంగం గణనీయమైన వృద్ధిని సాధించిందని సీడీఎస్ గుర్తుచేశారు. ప్రస్తుతం దేశీయ రక్షణ ఉత్పత్తి విలువ సుమారు రూ.1.27 లక్షల కోట్లకు చేరగా, రక్షణ ఎగుమతులు రూ.38,000 కోట్లు దాటాయని వెల్లడించారు. 100కు పైగా దేశాలకు భారత రక్షణ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో యువ ఇంజనీర్లు, ఆవిష్కర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా పాల్గొన్నారు.

## 'హైదరాబాద్ నగర పోలీస్' మరో చారిత్రాత్మక ముందడుగు

- ఏఐ కాప్ రైటర్ యాప్ ను ఆవిష్కరించిన సజ్జనార్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ 'హైదరాబాద్ నగర పోలీస్' మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భాషాపరమైన ఇబ్బందులు కలగకుండా, వారి ఫిర్యాదులను త్వరితగతిన, కచ్చితత్వంతో నమోదు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా 'ఏఐ కాప్‌రైటర్' అనే కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్‌ను హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆవిష్కరించారు. అనంతరం దాని పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీని ద్వారా 10కి పైగా భాషల్లో ఫిర్యాదులు నమోదు చేసే అవకాశం ఉందని అన్నారు. చెప్పిన విషయాలను వెంటనే టెక్స్ట్‌గా మార్చి అనువదించవచ్చని చెప్పారు. ఫిర్యాదు వివరాలు ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో సేవ్ అయ్యే సదుపాయం ఉందని తెలిపారు. వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్పారు. న్యాయానికి భాష అడ్డంకిగా ఉండకూడదన్న లక్ష్యంతో ఏఐ వినియోగిస్తున్నట్లు చెప్పారు. మొదట హైదరాబాద్ పరిధిలోని 80కి పైగా పోలీస్ స్టేషన్‌లలో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఎఫ్ఐఆర్ ప్రక్రియను వేగంగా, కచ్చితత్వంతో పూర్తి చేసేందుకు ఈ యాప్ దోహదపడుతుందని సజ్జనార్ పేర్కొన్నారు. బ్లూక్లౌడ్ సొల్యూషన్స్ సహకారంతో యాప్ రూపకల్పన చేసినట్లు చెప్పారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588